

పొట్టికప్ విశ్వవిజేత న్యూజిలాండ్ 6

- దక్షిణాఫ్రికాపై 32 పరుగులతో ఘనవిజయం
- మహిళల టి20 ప్రపంచకప్

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 79 | విజయవాడ, సోమవారం 21 అక్టోబర్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 21 October 2024 | Rs



102వ వసంతంలోకి వియస్ అచ్యుతానందన్ 5

ముఖ్యమంత్రి పినరయి విజయన్ సహా పలువురి శుభాకాంక్షలు

లెనిన్ స్ఫూర్తితో ముందుకు..

- మతోన్మాద శక్తులను అడ్డుకోవాలి • లెనిన్ శతవర్ధంతి సభలో ప్రబీర్ పుర్కాయస్థ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నిర్దిష్ట పరిస్థితులను నిర్దిష్టంగా అధ్యయనం చేయాలన్న లెనిన్ స్ఫూర్తితో ముందుకుసాగాలని న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ పిలుపునిచ్చారు. విఐ లెనిన్ శత వర్ధంతి సభ సందర్భంగా 'వర్తమానంలో లెనిన్ ప్రాధాన్యత' అనే అంశంపై విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సభ జరిగింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పుర్కాయస్థ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇటీవల కన్నుమూసిన సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరిపై ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించిన 'ప్రియతమ నేతకు అక్షర నివాళి' పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. అనంతరం పుర్కాయస్థ మాట్లాడుతూ.. గతితర్క భౌతికవాద సిద్ధాంతాన్ని లెనిన్ ప్రకృతి పరిణామాలన్నింటికీ వర్తింపజేశారని చెప్పారు. ప్రస్తుతం భారతదేశంలో మతతత్వ ప్రమాదం తీవ్రంగా ఉందని చెప్పారు. ప్రజలను, సమాజాన్ని విభజించాలనేది బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన లక్ష్యంగా ఉందన్నారు. ముస్లిం, మైనార్టీ, వామపక్ష శక్తులను, భావజాలాన్ని అణచివేయాలని ప్రయత్నిస్తున్నాయని చెప్పారు. ఇటువంటి వాటిని సైద్ధాంతికంగా, తాత్విక పరంగా ఎదుర్కోవాలన్నారు. కుల, మత, వర్ణ, వర్గభేదం లేకుండా అందర్నీ ఏకం చేస్తూ జరిగిన జాతీయోద్యమానికి అనుగుణంగా రూపకల్పన జరిగిన రాజ్యాంగాన్ని ఆర్‌ఎస్‌ఎస్ వ్యతిరేకించిందన్నారు. బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ ఎంచుకున్న హిందూత్వ ప్రాజెక్టులో భాగంగానే 'హిందీ-హిందూ రాష్ట్రం, 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' వంటి నినాదాలను ముందుకు తీసుకొస్తున్నారని వెల్లడించారు. న్యాయమైన డిమాండ్ల కోసం కార్మికులు చేస్తున్న పోరాటాల గురించి ప్రజలకు బడా మీడియా తెలియజేయకుండా ఈ పోరాటాల వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందన్నట్లుగా రాస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వాలు కోరుకుంటున్న విధంగా అవి వార్తలు ఇస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు తమకు తామే చేరవేసుకునే విధంగా సోషల్ మీడియా అభివృద్ధి చెందిందని తెలిపారు. పాలకుల్ని ప్రశ్నిస్తున్న ఈ మీడియాను సామాజిక ఉద్యమంగా మార్చేదిశగా ప్రయత్నాలు జరగాలని సూచించారు. ప్రపంచంలో ఒకపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నా అనేక మానవాభివృద్ధి సూచికల్లో అట్టడుగున దేశం ఉందన్నారు. విద్య, వైద్యానికి ప్రజలు పెద్దయెత్తున డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వాలు, పాలకవర్గాలు అమలు చేస్తున్న ఇటువంటి అంశాలను నిరంతరం ఎండగట్టాలని కోరారు. భావజాల వ్యాప్తికి, పాలక వర్గాల భావాలను ఎదుర్కొనేందుకు, సైద్ధాంతికంగా అభివృద్ధి చెందేందుకు కమ్యూనిస్టులు, వామపక్ష వాదులు, మేధావి వర్గం కృషి చేయాలని కోరారు.



వర్తమానంలో లెనిన్ ప్రాధాన్యత' అంశంపై ప్రసంగిస్తున్న న్యూస్ క్లిక్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థ

సోషలిజం వైపు ప్రపంచం చూపు : వి శ్రీనివాసరావు

ప్రపంచం సోషలిజాన్ని కోరుకుంటోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. 35 ఏళ్ల క్రితం నాటి నూతన ఆర్థిక విధానాల ప్రభంజనం ప్రస్తుతం లేదన్నారు. లెనిన్ మరోసారి ప్రపంచానికి, భారతదేశానికి అవసరమయ్యారని చెప్పారు. లెనిన్ కేవలం రష్యా విప్లవనేత మాత్రమే కాదని, భారతదేశానికి స్వాతంత్ర్యం రావాలని కోరుకున్న అంతర్జాతీయ విప్లవకారుల్లో మొదటి వ్యక్తి అని చెప్పారు. ప్రజల కొనుగోలు శక్తి ఆధారంగా ఆర్థిక పరిస్థితిని ఆర్థిక వేత్తలు అంచనా వేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో సెజ్‌ల పేరుతో రైతుల నుంచి 2.5 లక్షల ఎకరాలు భూములు తీసుకొని ఒక్క పరిశ్రమైనా ఏర్పాటు కాలేదన్నారు. సేకరించిన భూముల్లో పరిశ్రమలు పెట్టి ఉద్యోగాలు ఇవ్వకుండా ఎవరు అడ్డుకున్నారని నిలదీశారు. పిపిపి విధానంతో ప్రభుత్వ వ్యవస్థలను ప్రైవేట్‌పరం చేశారని, ఇప్పుడు పి4 నినాదంతో ప్రజల ఆస్తులను ప్రైవేట్ పరం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రయత్నిస్తున్నారని వెల్లడించారు. ప్రజల ఆస్తులను కొల్లగొట్టేందుకు విజన్-2047 ముసుగు వేస్తున్నారని విమర్శించారు. ప్రజల కొనుగోలు శక్తి పెరిగితేనే నిజమైన అభివృద్ధి అని అన్నారు. కార్మికులకు కనీసం వేతనం, రైతులకు గిట్టుబాటు ధర, వ్యవసాయ కార్మికుల వేతనాలు పెంచాలని, యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని ఇలా అయితేనే ఆదాయం పెరుగుతుందని చెప్పారు. 40 శాతం భూమి ఇంకా భూస్వాముల చేతుల్లోనే ఉన్నా దేశంలో భూస్వామ్య వ్యవస్థ లేదంటున్నారని చెప్పారు. భూ ఆధిపత్యం రైతుల చేతుల్లోకి వచ్చినప్పుడే అభివృద్ధి జరుగుతుందన్నారు. పెట్టుబడి మరింత క్రూరంగా, అన్యాయంగా ప్రజల శ్రమశక్తిని మరింత దోపిడీ చేస్తోందన్నారు. దేశంలో ఇప్పటికీ వివిధ రూపాల్లో కుల వ్యవస్థ కొనసాగుతున్నా.. అంటరానితనం లేదంటూ మరో తప్పుడు వాదన తీసుకొస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాజిక, ఆర్థిక దోపిడీలకు వ్యతిరేకంగా జమిలిగా పోరాడి అంతం చేసేందుకు లెనిన్ బోధనలు భారతదేశానికి అవసరమని చెప్పారు. లెనిన్ స్ఫూర్తితో కార్మికవర్గం చొరవ తీసుకొని శ్రామికరాజ్యం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. సదస్సుకు అధ్యక్షత వహించిన బాబూరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులపై సర్దుబాటు ఛార్జీలను రాష్ట్ర ప్రభుత్వం విధించబోతుందని వెల్లడించారు. విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా జరిగిన బషీర్‌బాగ్ పోరాట స్ఫూర్తితో మరో పోరాటం చేయాలని కోరారు. రాష్ట్రంలో ప్రస్తుతం రెడ్‌బుక్, గుడ్ బుక్ నడుస్తోందని విమర్శించారు. ప్రజలకు కావాల్సింది రెడ్ బుక్, గుడ్‌బుక్ కాదని, భారత రాజ్యాంగం అని చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఫాసిస్టు విధానాలు పాటిస్తూ హిట్లర్ వారసుడిగా కొనసాగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ వందన సమర్పణ చేసిన ఈ సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి తులసీదాస్, వై వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ పాల్గొన్నారు.

రాజకీయ నేతలకు న్యాయ'కీర్తనలు' తప్పే

న్యాయమూర్తుల రాజకీయ ప్రవేశం న్యాయ వ్యవస్థ విశ్వసనీయతకే దెబ్బ

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

న్యాయమూర్తులు రాజకీయ నాయకులను బహిరంగంగా కీర్తించడం, రాజకీయాల్లోకి న్యాయమూర్తులు ప్రవేశించడం వంటివి న్యాయ వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బ తీస్తాయని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ ఆర్ గవాయ్ వ్యాఖ్యానించారు. న్యాయ, రాజకీయ పాత్రల మధ్య విభజన రేఖను పాటించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. అహ్మదాబాద్‌లో గుజరాత్ రాష్ట్ర న్యాయ అధికారుల సమావేశంలో జస్టిస్ గవాయ్ "న్యాయవ్యవస్థలో విశ్వాస లోపం" అనే ప్రధాన అంశంపై ప్రసంగించారు. "ధర్మాసనంలో ఉన్నప్పుడు, ధర్మాసనం వెలుపల ఉన్నప్పుడు న్యాయమూర్తి ప్రవర్తన న్యాయపరమైన నీతికి సంబంధించిన అత్యున్నత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. ఒక న్యాయమూర్తి ఒక రాజకీయ నాయకుడిని లేదా బ్యూరోక్రాట్‌ని పొగిడితే, అది మొత్తం న్యాయ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని ప్రభావితం చేస్తుంది. మరొక ఉదాహరణ ఏమిటంటే, ఒక న్యాయమూర్తి వెంటనే ఎన్నికలలో పోటీ చేయడానికి తన పదవికి రాజీనామా చేస్తే, అది వారి నిష్పాక్షికతపై ప్రజల అవగాహనను ప్రభావితం చేయవచ్చు. నా అభిప్రాయం ప్రకారం, ప్రజా క్షేత్రంలో న్యాయమూర్తి చర్య తప్పనిసరి సముచితంగా ఉండాలి" అని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు.

మే 2025లో భారత ప్రధాన న్యాయమూర్తి కావడానికి సిద్ధంగా ఉన్న న్యాయమూర్తి, న్యాయమూర్తులు రాజకీయ పక్షపాతాన్ని సూచించే బహిరంగ ప్రవర్తనపై స్పందించారు. అది మొత్తం న్యాయ వ్యవస్థ సమగ్రతను బలహీనపరుస్తుందని హెచ్చరించారు. అంతేకాకుండా, న్యాయమూర్తులు తక్షణమే ఎన్నికల్లో పోటీ చేసేందుకు రాజీనామా చేయడంపై న్యాయమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వైఖరి న్యాయ నిష్పాక్షికత అవగాహనకు రాజీ పడుతుందని పేర్కొన్నారు. న్యాయ విశ్వసనీయతను కాపాడే పునాది సూత్రాలపై కేంద్రీకృతమైందన్నారు. ప్రత్యేకించి అధికార విభజన సిద్ధాంతం, న్యాయమూర్తుల నుండి ఆశించే ప్రవర్తన, ఇది కొనసాగడానికి నిందలకు అతీతంగా ఉండాలని అన్నారు. వ్యవస్థపై ప్రజల విశ్వాసం కల్పించాలన్నారు. "న్యాయ వ్యవస్థలో విశ్వాస లోపం మా సంస్థ పునాదికే ముప్పు తెస్తుంది. న్యాయ వ్యవస్థపై ప్రజల విశ్వాసం చెక్కుచెదరకుండా ఉండాలి. కాని విశ్వసనీయ లోటు ఉంటే, అది న్యాయ వ్యవస్థ వెలుపల న్యాయం కోసం ప్రజలను నెట్టవచ్చు. ఇది అప్రమత్తత, అవినీతి, విజిలింటేజిమ్ అనధికారిక మార్గాలతో కావచ్చు. ఇవన్నీ సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తాయి. అదేవిధంగా, కేసులు దాఖలు మిగతా 2లో



ప్రసంగిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి గవాయ్

బ్లాక్‌లో బ్రేక్ దర్శన టికెట్లు

- ఎమ్మెల్సీ జకియా ఖానం సహా ముగ్గురిపై కేసు నమోదు

ప్రజాశక్తి- తిరుమల

విఐపి బ్రేక్ దర్శన టికెట్లను బ్లాక్‌లో అమ్మినట్లు వైసిపి ఎమ్మెల్సీ జకియా ఖానంతో సహా ముగ్గురిపై తిరుమల వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... తిరుమల శ్రీవారి దర్శనం కోసం ఎమ్మెల్సీ సిఫార్సు లేఖపై ఆరుగురు భక్తులు టికెట్లు పొందారు. ఇందుకోసం ఎమ్మెల్సీ తరపున చంద్రశేఖర్ అనే వ్యక్తి రూ.65 వేలు తమ వద్ద వసూలు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) అధికారులకు వారు ఫిర్యాదు చేశారు. దీనిపై టిటిడి విజిలెన్స్ విభాగం అధికారులు విచారణ జరిపారు. ఇది వాస్తవమేనని నిర్ధారణ కావడంతో వారు తిరుమల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో, పోలీసులు చంద్రశేఖర్‌పైనా, ఎమ్మెల్సీ జకియా ఖానంపైనా, ఎమ్మెల్సీ పిఆర్ఒ కృష్ణతేజపైనా కేసు నమోదు చేశారు. చంద్రశేఖర్ పరారీలో ఉన్నట్లు సమాచారం.

ఘటన వెనుక రాజకీయ కోణం : ఎమ్మెల్సీ

ఈ వ్యవహారంలో తనకు ఎటువంటి సంబంధమూ లేదని ఎమ్మెల్సీ జకియా ఖానం తెలిపారు. ఈ ఘటన వెనుక రాజకీయ కోణం ఉందని ఆ రోపించారు. శశి కుమార్ గానీ, చంద్రశేఖర్‌గానీ ఎవరో తనకు తెలియదని తెలిపారు.



ఎమ్మెల్సీ జకియా ఖానం

ప్రస్తుతం తనకు పిఆర్ఒలు ఎవరూ లేరని, ఇంతకు ముందున్న పిఆర్ఒ భక్తులకు సరిగా స్పందించక పోవడంతో తీసివేశామని పేర్కొన్నారు. ఆ తర్వాత తన పిఎనే అన్నీ చూసుకుంటున్నారని, స్నేహితులకు మాత్రమే సిఫార్స్ లెటర్లు ఇస్తున్నానని తెలిపారు. పార్టీ మారడం తప్పు కాదని, ముఖ్యమంత్రులే అవసరాన్ని బట్టి పార్టీలు మారుతున్నారని పేర్కొన్నారు.

ఆమె వైసిపిలో లేరు : బొత్స

ఎమ్మెల్సీ జకియా ఖానం ఇప్పుడు వైసిపిలో లేరని శాసనమండలి సభ్యులు బొత్స సత్యనారాయణ తెలిపారు. సాధారణ ఎన్నికల తర్వాత ఆమె టిడిపికి వెళ్లారని చెప్పారు. మంత్రి లోకేష్‌తో పలుమార్లు ఆమె భేటీ అయ్యారన్నారు. మీడియాతో బొత్స మాట్లాడుతూ తిరుమలలో విఐపి బ్రేక్ దర్శన టికెట్లు అమ్ముకున్నట్లు వచ్చిన ఆరోపణలతో వైసిపికి సంబంధం లేదన్నారు.

నర్సుపై ప్రేమికుడి దాడి!

- బ్రెయిన్‌డెడ్ స్థితిలో బాధితురాలు
- ఆస్పత్రిలో చేర్పించి నిందితుడు పరారీ

ప్రజాశక్తి- తెనాలి, గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రయివేట్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్న యువతిపై ఆమె ప్రేమికుడు దాడి చేశాడు. దీంతో, ఆమె కోమాలోకి వెళ్లిపోయి బ్రెయిన్ డెడ్ స్థితిలో ఉన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో శనివారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం... కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామానికి చెందిన నవీన్, తెనాలిలో ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తున్న నర్సు మధిర సహన కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. శనివారం సాయంత్రం నవీన్ పుట్టిన రోజు సందర్భంగా ఆమెను కారులో బయటకు తీసుకెళ్లాడు. ఆ తర్వాత అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను తెనాలిలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించి, ఈ విషయాన్ని ఆమె తల్లిదండ్రులకు ఫోన్లో తెలియజేసి అక్కడి నుంచి పరారయ్యాడు. యువతి తల్లిదండ్రులు ఆస్పత్రికి వెళ్లి తన కుమార్తె పరిస్థితిపై వైద్యులను ఆరా తీశారు. ఆమె బ్రెయిన్ డెడ్ స్టేజ్‌లో ఉన్నట్లు చెప్పడంతో మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు, మంగళగిరి వైద్య శాలలకు తీసుకెళ్లారు. చివరకు తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. ఇక్కడ కూడా వైద్యులు ఆమె పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో గుంటూరు జిజిహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. సహన, నవీన్ మధ్య ఉన్న ప్రేమ వ్యవహారం తెలుసుకున్న యువతి కుటుంబసభ్యులు కొంతకాలంగా వ్యతిరేకిస్తున్నారు. ఆర్థికపరమైన విషయాల్లో నెలకొన్న విభేదాలతో ఉద్దేశపూర్వకంగానే తమ కుమార్తెపై పవన్ దాడి చేశాడని, అపస్మారక స్థితికి చేరిన తర్వాత ఆమెను ఆస్పత్రిలో చేర్పించాడని బాధితురాలి తల్లి అరుణ ఆరోపించారు. తమ కుమార్తె ఒంటిపై గాయాలున్నాయన్నారు. ముగ్గురు యువకులు కలిసి ఏదో చేశారని అనుమానం వ్యక్తం చేశారు. బ్రెయిన్ డెడ్ కావడంపై అనుమానాలున్నాయన్నారు. ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు. నిందితుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణ టూ టౌన్ పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు. సిఐ ఎండి నిస్సార్ బాషా కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. కాగా, నిందుతుడి కథనం మరోలా ఉంది. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించడానికి కారుకు తాను సడన్ బ్రేక్ వేయడంతో ఆమె ముందుకు తూలిపడి తలకు దెబ్బ తగిలి వాంతులు చేసుకుందని, తర్వాత ఆమె స్పృహ కోల్పోయిందని చెప్తున్నాడు. నిందితుడుపై తెనాలి పోలీస్ స్టేషన్లో రౌడ్ షీట్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



చికిత్స పొందుతున్న సహన

పలువురి పరామర్శ

బ్రెయిన్ డెడ్ అయిన యువతిని గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో మాజీ మంత్రి మేరుగ నాగార్జున, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆదివారం రాత్రి పరామర్శించారు. యువతిపై దాడిని మేరుగ నాగార్జున ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి మహిళలపైనా, చిన్న పిల్లలపైనా దాడులు పెరిగిపోయాయన్నారు. బాధితురాలికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ నిందితుడిని కాపాడేందుకు టిడిపి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఆలపాటి, పేరబత్తుల

- ప్రకటించిన టిడిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో త్వరలో జరగనున్న పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు టిడిపి తన అభ్యర్థులను ప్రకటించింది. కృష్ణా-గుంటూరు శాసనమండలి నియోజకవర్గ అభ్యర్థిగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ప్రకటించింది. పశ్చిమ - తూర్పు గోదావరి జిల్లాల నియోజకవర్గ అభ్యర్థిగా పేరబత్తుల రాజశేఖరం పేరును ఖరారు చేసింది. టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఈ పేర్లను ఖరారు చేసినట్లు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెనాలి నుంచి పోటీ చేయాలని ఆలపాటి రాజేంద్రప్రసాద్ భావించారు. పొత్తులో భాగంగా ఆ సీటును జనసేన నేత, మంత్రి నాదెండ్ల మనోహర్‌కు కేటాయించారు. పేరబత్తుల రాజశేఖరం కాకినాడ రూరల్ నుంచి పోటీ చేయాలని ఆశించారు. ఈ సీటును కూడా పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించారు.

అతిసార మరణాలపై సర్కారు సీరియస్

- విచారణాధికారిగా విజయానంద్ : సిఎం చంద్రబాబు
- నేడు గుర్లకు పవన్‌కల్యాణ్
- కారణాలపై సమగ్ర సర్వే : కృష్ణబాబు వెల్లడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గం గుర్లలో అతిసార వ్యాధితో ఎనిమిదిమంది మరణించిన ఘటనపై సీనియర్ ఐఎఎస్ అధికారి కె విజయానంద్‌ను విచారణ అధికారిగా ప్రభుత్వం నియమించింది. మరణాలకు అసలు కారణం ఏంటి? ఆయా ప్రభుత్వశాఖల పరంగా ఉన్న సమస్యలు ఏమిటనే విషయం తెలుసుకునేందుకు సమగ్ర విచారణ జరపాలని సిఎం నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఈ నెల 21న గుర్లకు వెళ్లనున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి నీటి కలుషితమా లేక ఇతర కారణాల వల్ల డయేరియా ప్రబలిందా అనే అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు. ఇదే సందర్భంలో ఒక్కరు మాత్రమే డయేరియాతో మరణించగా, మిగిలిన ఏడుగురు ఇతర వ్యాధులతో చనిపోయారని వైద్యారోగ్యశాఖ పేర్కొంటోంది. సిఎం చంద్రబాబు ఆదివారం వైద్యశాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. డయేరియా వల్లనే మరణాలు అనే అంశంపై వైద్యారోగ్యశాఖాధికారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ ప్రాంతంలో నీటిని ఎప్పటికప్పుడు పరీక్షలకు పంపాలని, సమస్య పరిష్కారమయ్యే వరకు తాగునీరు సరఫరా చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. వైద్యశిబిరాలు కొనసాగించాలని సూచించారు. వైద్యారోగ్యశాఖ, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్ శాఖలు పరస్పరం సమన్వయంతో పనిచేయాలని సిఎం చంద్రబాబు ఆదేశాలిచ్చారు. ప్రజలకు ధైర్యం చెప్పి, సమస్య పరిష్కారమయ్యే వరకు వారికి అండగా ఉండాలని అధికారులకు సిఎం సూచించారు.



చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు (ఫైల్)

గుర్లలో డయేరియా వ్యాప్తికి కారణాలపై అధ్యయనం చేసి సమగ్ర సర్వే నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ స్పెషల్ సిఎస్ ఎమ్‌టి కృష్ణబాబు పేర్కొన్నారు. తాగునీటి నమూనాలను ప్రయోగశాలకు పంపామని, నీరు కలుషితమైనట్లు తేలిందని అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 13 నుంచి 15 వరకు డయేరియా కేసులు పెరిగాయని, గత నాలుగు రోజులుగా కేసుల నమోదులో తగ్గుదల కనబడిందన్నారు. వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలతో ఆ ప్రాంతానికి హెల్త్ డైరెక్టరు పద్మావతిని పంపించామని, ఆమె అక్కడే ఉండి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. డీహైడ్రేషన్ బాగా ఉన్న డయేరియా కేసులను చీపురుపల్లి సిహెచ్‌సికి, విజయనగరం జిజిహెచ్, వైజాగ్ కెజిహెచ్‌లకు తరలించారని, ఇంటింటి సర్వే చేసి అనుమానిత కేసులను ఉచిత వైద్య శిబిరాలకు తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకున్నారని చెప్పారు. పబ్లిక్ హెల్త్ స్పెషలిస్టు, ఎపిడిమాలజిస్ట్, మైక్రోబయాలజీ, కమ్యూనిటీ మెడిసిన్ నిపుణులతో ప్రత్యేక బృందం ఏర్పాటుచేసి ఆ ప్రాంతంలో సమగ్ర సర్వే చేసి నివేదికను పంపించాలని ఎమ్‌టి కృష్ణబాబు ఆదేశించారు. ప్రస్తుతం 53 మంది చికిత్స పొందుతుండగా, వీరిలో గుర్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 17 మంది విశాఖ కెజిహెచ్, జిజిహెచ్, విజయనగరం ఘోషాస్పత్రి, చీపురుపల్లి సిహెచ్‌సిలో 36 మంది చికిత్స పొందుతున్నట్లు కృష్ణబాబు పేర్కొన్నారు.

మందుపాతర పేలి ముగ్గురు జవాన్ల మృతి

ప్రజాశక్తి- బ్రహ్మంగారి మఠం

ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి వైఎస్ఆర్ జిల్లా బ్రహ్మంగారి మఠం మండలం పాపిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన జవాన్ కొడవటికంటి రాజేష్ (36) మృతి చెందారు. ఆయన కుటుంబసభ్యుల కథనం ప్రకారం... ఛత్తీస్‌గఢ్‌లోని ఐటిబిపి (ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్)లో రాజేష్ విధులు నిర్వహిస్తున్నారు. ఐటిబిపి, బిఎస్ఎఫ్ దళాలు సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి.



రాజేష్ (ఫైల్)

శనివారం మధ్యాహ్నం నారాయణపూర్‌కు తిరిగి వస్తుండగా కొడ్లియార్ గ్రామం వద్ద మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలడంతో రాజేష్‌తోపాటు అదే దళానికి చెందిన మరో ఇద్దరు జవాన్లు మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. రాజేష్ భౌతికకాయం ఆదివారం రాత్రి పాపిరెడ్డిపల్లెకు చేరుకుంది. సోమవారం ఉదయం అంత్యక్రియలు జరగనున్నాయి.



ఉత్తర గాజా బీట్ లాహియాలో ఇజ్రాయిల్ దాడితో ధ్వంసమైన ప్రాంతాన్ని ఆదివారం పరిశీలిస్తున్న పాలస్తీనా వాసులు

ఉత్తర గాజాలో భీకర దాడులు

- ముగ్గురు హిజ్బుల్లా కమాండర్లు సహా 76 మంది మృతి

బీరుట్ /గాజా సిటీ : ఇజ్రాయెల్ సైన్యం లెబనీస్ రాజధానిలోని ఇంటెలిజెన్స్ ప్రధాన కార్యాలయం, భూగర్భ ఆయుధాల తయారీ కేంద్రంపైన, ఉత్తర గాజాపైన ఇజ్రాయిల్ క్రూరమైన వైమానిక దాడులు జరిపి ముగ్గురు హిజ్బుల్లా కమాండర్లతో సహా 76 మందిని పొట్టనబెట్టుకుంది. లెబనాన్‌పై జరిపిన దాడిలో హిజ్బుల్లా సదరన్ కమాండ్‌లోని టాప్ కమాండర్ అల్హాజ్ అబ్బాస్ సలేం, కమ్యూనికేషన్స్ స్పెషలిస్ట్ రడ్జా అబ్బాస్ అవ్చే , హిజ్బుల్లా వ్యూహాత్మక ఆయుధాల అభివద్ధిని పర్యవేక్షిస్తున్న అహ్మద్ అలీ హుస్సేన్ చనిపోయినట్లు రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది. ఇరాన్-మద్దతుగల బందం తన నివాసాన్ని లక్ష్యంగా చేసుకుని తనను హత్య చేసేందుకు ప్రయత్నించిందని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు ఆరోపించిన మిగతా 2లో

ఆయుధ నౌకను అడ్డుకున్న ఏథెన్స్ డాక్ కార్మికులు 5

జగన్ వ్యాఖ్యల పట్ల లోకేష్ ఆగ్రహం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తన పాలనలో వేల మంది చనిపోయినా ఏనాడు ఒక్కమాట, ఒక్క సమీక్ష కూడా చేయని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో శాంతిభద్రతల గురించి మాట్లాడటం తగదని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్లపాటు గంజాయి, డ్రగ్స్‌ను వ్యాప్తిచేసి సొమ్ము చేసుకుని ఊరికో ఉన్మాదిని పెంచి పోషించి ప్రజల మీదకు వదిలారని ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. అవినాష్ రెడ్డి హత్య చేసినా కాపాడావని పేర్కొన్నారు. దళితులను చంపిన అనంతబాబును ఇంటికి పిలిచి భోజనం పెట్టావని, మహిళలని వేధించిన వారిని అందలం ఎక్కించావని, ఎర్రచందనం స్మగ్లింగ్ చేసే వాళ్లకు టికెట్లు ఇచ్చావని విమర్శించారు. ఐదేళ్ల పాలనలో 2027 మంది మహిళలు దారుణ హత్యకు గురయ్యారని, 30 వేల మంది మహిళలు అదృశ్యమయ్యారని అన్నారు. దిశ చట్టం అంటూ లేని చట్టాన్ని ఉన్నట్లు ప్రచారం చేస్తున్నావని, ఈ చట్టం ప్రకారం ఒక్కరికైనా ఉరిశిక్ష వేశారా? అని ప్రశ్నించారు.

ఈతకెళ్లి ఇద్దరు బిటెక్ విద్యార్థుల మృతి

ప్రజాశక్తి-గన్నవరం

ఈతకెళ్లి ఇద్దరు బిటెక్ విద్యార్థులు మృతి చెందిన సంఘటన కృష్ణా జిల్లా గన్నవరం మండలం మాదలవారిగూడెం సమీపంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాదలవారిగూడెంలోని లింగయ్య కాలేజీలో ఎన్‌టిఆర్ జిల్లా గంపలగూడెంకు చెందిన పి.దుర్గారావు (22), తెలంగాణ రాష్ట్రంలోని యాదాద్రికి చెందిన జె వెంకటేష్ (22) బిటెక్ నాలుగో ఏడాది చదువుతున్నారు. ఆదివారం సెలవు రోజుకావడంతో మరో ఐదుగురు స్నేహితులతో కలిసి సమీపంలోని క్వారీ వద్దకు ఈత కొడదామని వెళ్లారు. క్వారీలో లోతు ఎక్కువగా ఉండడంతో ప్రమాదవశాత్తు దుర్గారావు, వెంకటేష్ నీటిలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న గన్నవరం ఎస్ఐ ప్రేమ్ కుమార్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది క్వారీలో గాలింపు చేపట్టి ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను గన్నవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

26న ఆలయాలు, పంచారామాల సందర్శనకు సన్నాహాలు : మంత్రి దుర్గేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆలయాలు, పంచారామ క్షేత్రాలను సందర్శించేలా ఈ నెల 26న ఒకరోజు ప్యాకేజీకి పర్యాటకశాఖ సన్నాహాలు చేస్తోందని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. కోరుకొండ, అన్నవరం, పిఠాపురం, సామర్లకోట, ద్రాక్షారామం, వాడపల్లి ఆలయాలను కలుపుతూ ప్రతి శనివారం అందుబాటులో బస్సులను ఉంచనున్నట్లు తెలిపారు. పర్యాటకుల రద్దీ డిమాండ్ దృష్ట్యా ఆదివారం కూడా బస్సులు ఏర్పాటుచేసే ఆలోచన చేస్తున్నట్లు పేర్కొన్నారు. టూరిజం ప్యాకేజీ కింద బస్సులో పెద్దలకు రూ.1000, మూడు నుంచి పదేళ్ల వయసు ఉన్న చిన్నారులకు రూ.800 టికెట్‌గా నిర్ణయించినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో తల్లీకొడుకు మృతి

ప్రజాశక్తి - సామర్లకోట(కాకినాడ జిల్లా)

విదుదాఘాతంతో ఒక్క రోజు వ్యవధిలోనే తల్లీ కొడుకు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాద సంఘటన కాకినాడ జిల్లా సామర్లకోట మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... వీరరాఘవపురం గ్రామంలో చిట్టిమాని నూకరాజు, పద్మావతి దంపతులు కుమారుడు, కుమార్తెతో కలిసి నివసిస్తున్నారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శనివారంనాడు పద్మావతి (44) బట్టలు ఉతికి తీగపై ఆరేస్తుండగా ఎదురుగా ఉన్న డ్రెయినేజీలో పడి మృతి చెందారు. శనివారమే ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. ఆదివారం ఉదయం పద్మావతి కుమారుడు విశ్వేస్ (23) తన మేనత్తకు తల్లి మరణఘటనను వివరిస్తూ అక్కడే బట్టలు ఆరబెట్టే తీగను పట్టుకోగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఇంట్లోని ఎర్త్ వైరు తెగిపడి ఉండటాన్ని కుటుంబ సభ్యులు గమనించారు. దీనిగుండా విద్యుత్ ప్రవహించడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు గుర్తించారు. పద్మావతి కూడా ఇలాగే మరణించి ఉంటుందని తెలిపారు. ఒక్క రోజు వ్యవధిలోనే తల్లీ కొడుకుల ప్రాణాలు కోల్పోవడంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పని ప్రదేశాల్లో మహిళలపై దాడులకు వ్యతిరేకంగా పోరు

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నిర్మాణ పని ప్రదేశాల్లో మహిళలపై జరుగుతున్న దాడులు, అసాంఘిక చర్యలకు వ్యతిరేకంగా పోరాటాలు చేపడతామని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు తెలిపారు. ఏలూరులోని సిఐటియు జిల్లా కార్యాలయంలో భవన నిర్మాణ మహిళా కార్మికుల రాష్ట్ర సమావేశం ఆదివారం జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారపల్లి రమణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో నిర్మాణ పనుల్లో మహిళలు ఎక్కువ మంది కూలీలుగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారని, పనుల కోసం ఇతర రాష్ట్రాల నుండి కూడా వస్తున్నారని తెలిపారు. ఈ తరుణంలో పని ప్రదేశాల్లో, నివాసాలు ఉన్నచోట మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని అన్నారు. దీనికి ప్రభుత్వాలు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సంఘటనలు జరిగినప్పుడే హడావుడి చేస్తోంది తప్ప శాశ్వత పరిష్కారంలో విఫలమైందన్నారు. మహిళలకు రక్షణగా దిశా చట్టం తెచ్చారేగానీ ఆచరణలో ఉపయోగం లేకుండాపోతుందని తెలిపారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తేవాలని డిమాండ్ చేశారు. నిర్మాణ కార్మికులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా రాబోయే రోజుల్లో భవన నిర్మాణ కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌వి.నరసింహారావు మాట్లాడుతూ.. వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన వలస కార్మికులు అనేక చోట్ల నివసిస్తున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వలస కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బి.సాంబశివ, ఉపాధ్యక్షులు అల్లాడి గోపాల్, యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎర్ర రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వి.ఉమామహేశ్వరరావు

నేడు అల్పపీడనం ఏర్పడే అవకాశం

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉత్తర అండమాన్ సముద్రం మీదుగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని, దీని ప్రభావంతో రానున్న 24 గంటల్లో తూర్పు మధ్య బంగాళాఖాతాన్ని ఆనుకుని ఉన్న ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ఇది పశ్చిమ వాయువ్య దిశగా పయనించి ఈ నెల 22 నాటికి వాయుగుండంగా, 23 నాటికి తూర్పు మధ్య బంగాళాఖాతంలో తుపానుగా మారే అవకాశం ఉందని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనంతరం ఇది వాయువ్య దిశగా పయనించి 24వ తేదీ నాటికి ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలకు ఆనుకుని వాయువ్య బంగాళాఖాతానికి చేరుకునే అవకాశం ఉందన్నారు. దీని ప్రభావంతో ఈ నెల 24, 25 తేదీల్లో ఉత్తరాంధ్రలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు పడొచ్చని తెలిపారు. 23, 24 తేదీల్లో పశ్చిమ మధ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో గంటకు 45 నుంచి 65 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొన్నారు. 24వ తేదీ వరకూ సముద్రం అలజడిగా ఉంటుందని, మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. వేటకు వెళ్లిన మత్స్యకారులు వెంటనే తిరిగి రావాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

త్వరలో సిఎన్‌జి ధర పెంపు

- కిలోకు రూ.6 వరకు పెరగొచ్చు

న్యూఢిల్లీ : మోటారు వాహనాలకు ఉపయోగపడే సిఎన్‌జి ధరలను భారీగా పెంచే యోచనలో కేంద్రం ఉంది. రాబోయే రోజుల్లో సిఎన్‌జి వాహన వినియోగదారులపై కిలోకు ధర రూ.4 నుంచి రూ.6 వరకు పెంచనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఎక్సైజ్ సుంకం తగ్గించడంతో పెరుగుతున్న సిఎన్‌జి ధరలను నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నట్లుగా తెలిపాయి. సిఎన్‌జి సరఫరాలో ప్రభుత్వం 20శాతం కోత విధించింది. లెగసీ ఫీల్డ్ నుంచి ఉత్పత్తి చేసిన గ్యాస్ నగరాల్లోని రిటైల్ గ్యాస్ సరఫరాదారులకు పంపిస్తారు. ఈ గ్యాస్ సరఫరాలో ఏటా 5 శాతం కోత విధిస్తూ వస్తున్నారు.

దీంతో సరఫరా తగ్గిపోవడంతో సిఎన్‌జి ధర పెరగనుంది. ఈ నేపథ్యంలోనే రాబోయే రోజుల్లో ధరలు పెరిగే అవకాశం ఉంది. త్వరలోనే మహారాష్ట్ర, జార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఆ తర్వాత ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో పెరుగుతున్న ధరలను కట్టడి చేసేందుకు ప్రభుత్వం సిఎన్‌జిపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం సిఎన్‌జిపై 14 శాతం ఎక్సైజ్ సుంకం అమల్లో ఉంది. దీన్ని తగ్గించినట్లయితే, రిటైలర్లు పెరిగిన ధరను వినియోగదారులకు బదిలీ చేయాల్సిన అవసరం లేదని సంబంధిత వర్గాలు తెలిపాయి.

ముంబయి, ఢిల్లీతో పాటు పలు నగరాల్లోనూ సిఎన్‌జిపై ఆధారపడి అధికంగా వాహనాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో ధరల ప్రభావం ఓటర్లపై పడకుండా చూడాలని ప్రభుత్వం భావిస్తుందని.. ఈ క్రమంలోనే సెంట్రల్ ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించే ఆలోచనలు ఉన్నట్లు చర్చ జరుగుతోంది. కాగా.. ఆయా రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే సిఎన్‌జిపై మళ్లీ ధరలు పెంచే అవకాశం ఉందని అనుమానాలు బలంగా వినపడుతోన్నాయి.

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

- 6 గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు /గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జలాశయానికి వరద పెరగడంతో ఆరు గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ జూరాల నుండి 1,28,368 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 67,312 క్యూసెక్కులు, హంద్రీ ద్వారా 250 క్యూసెక్కులతో కలిపి 1,95,930 క్యూసెక్కుల నీరు వస్తుండడంతో ఆనకట్ట నుండి ఆరు గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 1,67,898 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయ నీటిమట్టం 885 అడుగులకుగాను ప్రస్తుతం 884.80 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 215 టిఎంసిలకుగాను ప్రస్తుతం 214.8450 టిఎంసిలుగా ఉంది. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు 10,167 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 1561 క్యూసెక్కులు, మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు 1831 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రం ద్వారా 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు జల విద్యుత్తు కేంద్రం ద్వారా 30,698 క్యూసెక్కులు మొత్తం 66,013 క్యూసెక్కులతోపాటు జలాశయం నుండి 2,27,911 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు.


ప్రకాశం బ్యారేజి వద్ద దిగువకు వస్తున్న నీటి ప్రవాహం

ప్రకాశం బ్యారేజీ 70 గేట్లు ఎత్తి నీటి విడుదల

కృష్ణా నదికి వరద ప్రవాహం పెరగడంతో అధికారులు ప్రకాశం బ్యారేజీ 70 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్‌కు ఎగువ నుంచి 1,89,132 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా 2,02,956 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతలకు 2,38,720 క్యూసెక్కుల వరద వస్తుండగా దిగువకు 2,38,720 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భారీ మొత్తంలో నీటి ప్రవాహం వస్తుండడంతో నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

క్లీన్ ఎనర్జీ పాలసీతో ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధి

- ఉపాధి అవకాశాల కల్పనకు అవకాశాలు
- ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, పారిశ్రామికాభివృద్ధితో పాటు దాదాపు 7.5 లక్షల నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ (ఐసిఎ) పాలసీ-2024 దోహదపడుతుందని ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తెలిపారు. రాబోయే ఐదేళ్లలో రాష్ట్రానికి దాదాపు రూ.67 వేల కోట్ల ఆదాయం సాధించే దిశగా పాలసీ అమలుకు విద్యుత్ సంస్థలు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. క్లీన్ ఎనర్జీకి సంబంధించిన అంశాలు, అమలు చేసే చర్యలపై జెన్‌కో ఎమ్‌డి కెవిఎన్ చక్రధర్‌బాబు, ట్రాన్స్‌కో జెఎమ్‌డి కీర్తి చేకూరితో కలిసి విజయానంద్ ఆదివారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వం, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో రాష్ట్రంలో స్వచ్ఛ ఇంధన ఉత్పత్తికి ఖరారు చేసే ప్రభుత్వ విధి, విధానాలు భవిష్యత్తులో పునరుత్పాదక ఇంధనరంగ అభివృద్ధికి బాటలు వేస్తాయని చెప్పారు. క్లీన్ ఎనర్జీ సొల్యూషన్స్‌ను ప్రోత్సహించడం ద్వారా పునరుత్పాదక ఇంధన వనరులను వినియోగించుకోవడం, రాష్ట్ర, దేశ స్థాయిలో నెట్ జీరో లక్ష్యాల సాధన దిశగా పురోగతిని సాధించడం, అత్యాధునిక సాంకేతికత స్వీకరణ, ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్, ఇంధన వ్యయాన్ని సమతుల్యం చేయడం, గ్రీన్ ఎనర్జీ కారిడార్లు, ఆర్థిక వ్యవస్థ బలోపేతం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి అంశాలు పాలసీలో ఉన్నాయని వివరించారు. తక్కువ లీజు ధరలకు భూమి, సేకరించిన భూమికి స్టాంప్ డ్యూటీ మినహాయింపు, ప్లాంట్‌కు క్యాపిటల్ సబ్సిడీ, ఇంటిగ్రేటెడ్ గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ స్టోరేజి కోసం నెట్ ఎస్‌జిఎస్‌టి రీయింబర్స్‌మెంట్, పవర్ సబ్సిడీతో పాటు స్మాల్ హైడ్రో, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ కోసం విద్యుత్ డ్యూటీ రీయింబర్స్‌మెంట్ వంటి ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు. క్లీన్ ఎనర్జీ రంగంలో అగ్రగామి రాష్ట్రంగా నిలబెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం 78.5 గిగా వాట్ల సౌరశక్తి, 35 గిగావాట్ల పవన శక్తి, 22 గిగావాట్ల పంప్డ్ స్టోరేజ్, 22 గిగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్, 1.5 ఎంఎంటిపిఎ గ్రీన్ హైడ్రోజన్, 1500 కెఎల్‌పిడి ఇథనాల్, 1000 టిపిడి బయో సిఎన్‌జి/సిబిజి, 500 పబ్లిక్ ఛార్జింగ్ స్టేషన్‌ల ఇవి ఛార్జింగ్ స్టేషన్ల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, 30 గిగావాట్ల క్లీన్ టెక్ తయారీ వంటి ప్రతిష్ఠాత్మక లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డిస్కమ్‌ల సిఎమ్‌డిలు ఐ పృథ్వీతేజ్, పట్టాన్ శెట్టి రవి, కె సంతోషరావు, సోలార్ పవర్ కార్పొరేషన్ ఎమ్‌డి ఎం కమలాకర్ బాబు పాల్గొన్నారు.

డ్రోన్ షో ప్రత్యక్ష ప్రసారానికి 5 చోట్ల డిజిటల్ తెరలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమరావతి డ్రోన్ సమ్మిట్‌లో భాగంగా విజయవాడ పున్నమి ఘాట్‌లో ఈ నెల 22న సాయంత్రం నిర్వహించనున్న మెగా డ్రోన్ షోను ప్రజలు తిలకించేందుకు నగరంలో 5 చోట్ల భారీ డిజిటల్ తెరలు ఏర్పాటు చేస్తున్నట్లు డ్రోన్ కార్పొరేషన్ ఎమ్‌డి కె దినేష్ కుమార్ తెలిపారు. బెంజ్‌సర్కిల్, రామవరప్పాడు రింగ్ సెంటర్, వారధి, బస్టాండ్, ప్రకాశం బ్యారేజీల వద్ద ఈ భారీ డిజిటల్ తెరలు ఏర్పాటుచేసి డ్రోన్ షోను ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. డ్రోన్ షో, క్రాకర్స్ షో, సాంస్కృతిక కార్యక్రమాలకు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు 10 మంది డిప్యూటీ కలెక్టర్లకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించామన్నారు. మరో 300 మంది అధికారులు, సిబ్బంది ఏర్పాట్లలో నిమగ్నమయ్యారని పేర్కొన్నారు.

AMARAVATI DRONE SUMMIT

ఉత్తర గాజాలో భీకర దాడులు

(మొదటి పేజీ తరువాయి)

కొద్ది సేపటికే హిజ్బుల్లా దక్షిణ బీరుట్ కోటపై భీకర దాడులు జరిగాయి. అదే సమయంలో ఉత్తర గాజాలో బీట్ లాహియాపై జరిపిన ఈ దాడుల్లో 73 మంది పాలస్తీనియన్లు చనిపోయారు. . గాజా, లెబనాన్‌లలో మొత్తం 175" లక్ష్యాలపై ఇజ్రాయిల్ వైమానిక దాడులు చేసింది. "నన్ను , నా భార్యను హత్య చేసేందుకు ఇరాన్ అనుబంధ సంస్థ హిజ్బుల్లా చేసిన ప్రయత్నం ఘోర తప్పిదం" అని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు అన్నారు. ఇజ్రాయెల్ దళాలు బుధవారం గాజాలో పాలస్తీనా ఉద్యమ నాయకుడు యాహ్యా సిన్వార్‌ను హతమార్చిన తర్వాత ఈ ప్రాంతంలో హమాస్, హిజ్బుల్లా, ఇరాన్-మద్దతుగల గ్రూపులు తమ శత్రువుపై పోరాటం కొనసాగుతుందని ప్రకటించాయి. పాలస్తీనాలో హమాస్ అనేది ఎవరూ విస్మరించలేని వాస్తవం, దానిని ఎవరూ నాశనం చేయలేరు" అని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘీ అన్నారు. ఇజ్రాయెల్ ఉత్తర గాజాలో రెండు వారాల్లో 450 మందిని పొట్టనబెట్టుకుంది.. దీంతో గాజాలో మొత్తం మరణాల సంఖ్య 42,519కి చేరుకుంది. జబాలియాలోని సహాయక శిబిరంపై జరిగిన దాడిలో 10 మంది మరణించారు.

హిజ్బుల్లా టన్నెల్ నెట్‌వర్క్‌పై ఇజ్రాయిల్ గురి

కొన్ని కిలోమీటర్ల పొడవైన సొరంగాల నెట్‌వర్క్‌ను ఇజ్రాయిల్ సైన్యం గుర్తించింది. వీటిలో వందలాది మంది హిజ్బుల్లాలు తలదాచుకోవచ్చు.. ఇక్కడ అవసరమైన ఆహార పదార్థాలను నిల్వ చేస్తారు. నీరు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తారు. ఆయుధాలను పంపిణీ చేసే సదుపాయం కూడా ఉంది. సొరంగాలను ధ్వంసం చేసేందుకు లేదా వాటిని సిమెంటుతో కప్పేందుకు ప్రయత్నిస్తున్నారని ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ అధికారి ఒకరు తెలిపారు. 2006లో ఇజ్రాయెల్‌తో జరిగిన యుద్ధంలో హిజ్బుల్లా తొలిసారిగా సొరంగాలను ఉపయోగించింది. తర్వాత ఆ నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేసింది. ట్రక్కులు క్షిపణులుగా వెళ్లగల భారీ సొరంగాల వీడియోలను హిజ్బుల్లా విడుదల చేసింది.


దీక్షల్లో కూర్చున్న ప్రజా సంఘాల నాయకులు

స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేస్తే సహించం

- బిహెచ్‌ఇఎల్ ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ప్రభుత్వ రంగంలోని వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూస్తోందని, ఆ చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని బిహెచ్‌ఇఎల్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకులు ఎస్.జగన్నాథరావు హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు ఆదివారానికి 1302వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ విషయంలో రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం నాన్చివేత ధోరణితో వ్యవహరిస్తోందని తెలిపారు. కర్మాగారంపై ఎవరికి తోచిన విధంగా వారు ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉక్కు ప్రయివేటీకరణను నిలుపుదల చేస్తున్నట్టు ప్రకటించే వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రానున్న కాలంలో మరిన్ని పోరాటాలకు కార్మికులు, ప్రజలు సిద్ధం కావాల్సి ఉందని తెలిపారు. దీక్షల్లో ప్రజా సంఘాల నాయకులు ఎ.సీతాలక్ష్మి, బిఎస్ఎన్.రాజు, కామేశ్వరరావు, కె.నారపరెడ్డి, జి.అచ్చం నాయుడు, ఎంసిహెచ్.అప్పడు, పి.కనకారావు, బి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రాష్ట్రంలో మిషన్ లైఫ్ అమలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మిషన్ లైఫ్ అమలు కోసం బిఇఇతో కలిసి పనిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని బిఇఇ దక్షిణాది రాష్ట్రాల మీడియా సలహాదారు ఎ చంద్రశేఖర్ రెడ్డి వెల్లడించారు. దేశంలో ఇంధన సామర్థ్యం పెంపు కోసం మిషన్ లైఫ్ కార్యక్రమాల గురించి విస్తృతంగా అవగాహన కల్పించేందుకు బిఇఇ కృషిని ఎపి ప్రభుత్వం ప్రశంసించిందని ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉన్నతమైన పర్యావరణ ప్రమాణాలతో కూడిన మెరుగైన జీవనం కోసం ముందుకు సాగాలనే లక్ష్యంతో ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఎపి ఇంధన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, ఎపి ఇంధన పరిరక్షణ సమితి సిఇఒ బివివి కుమార్ రెడ్డితో ఇటీవల సమావేశమైనట్లు వెల్లడించారు. తిరుపతి, విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు, త్రివేండ్రం, చెన్నైతో పాటు కేంద్రపాలిత ప్రాంతాలతో సహా దక్షిణ భారతదేశంలోని ప్రధాన నగరాల్లో మిషన్ లైఫ్ ప్రచారం లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడించారు. ఇంధన వినియోగంలో రాష్ట్ర సామర్థ్యం మరింత మెరుగయ్యేలా రాష్ట్ర ప్రభుత్వంలో ఉన్న కీలకమైన అన్ని విభాగాలను ఈ కార్యకలాపాల్లో భాగస్వామ్యం చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఆ దిశగా పనిచేస్తున్న ఎపి ఇంధన పరిరక్షణ సమితి వంటి సంస్థలను భాగస్వాములను చేయడం ద్వారా లక్ష్యసాధన కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం అమలు వల్ల రాష్ట్ర ఆర్థిక ప్రగతి మెరుగుపడటంతోపాటు ఇంధన భద్రత, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు సాధించొచ్చని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీ, కొడుకు మృతి

- తండ్రి, మరో కుమారుడికి గాయాలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట (ఎన్‌టిఆర్ జిల్లా)

ఎన్‌టిఆర్ జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జగ్గయ్యపేట మండలం గరికపాడు జాతీయ రహదారిపై రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొనడంతో తల్లీ కొడుకు మృతి చెందగా తండ్రి, మరో కుమారుడు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణా జిల్లా గుడివాడ మండలం బిల్లపాడు గ్రామానికి చెందిన నీలా నాగ వెంకట మల్లికార్జునరావు తన కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నారు. గత మూడు రోజుల క్రితం తన తల్లిని చూసేందుకు భార్య నాగలక్ష్మి (56), కుమారులు శ్రీకాంత్ (32), చైతన్య ఫణికాంత్‌లతో కలిసి కారులో స్వగ్రామానికి వచ్చారు. విజయవాడలో దుర్గమ్మ దర్శనం అనంతరం తిరుగు ప్రయాణం అయ్యారు. గరికపాడు వంతెన మీదకు చేరుకోగానే వీరు ప్రయాణిస్తున్న కారు.. హైదరాబాదు నుండి విజయవాడ వస్తున్న కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నాగలక్ష్మి, శ్రీకాంత్ అక్కడికక్కడే మృతి చెందారు. మల్లికార్జునరావు, చైతన్య ఫణికాంత్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులకు జగ్గయ్యపేటలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం బంధువులకు అందించారు. చిల్లకల్లు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాహన ఎగుమతుల్లో 14 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన కాలంలో భారత వాహన ఎగుమతులు 14 వాతం పెరిగి 25,28,248 యూనిట్లకు చేరినట్లు సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మానుఫాక్చరర్స్ (సియామ్) వెల్లడించింది. గతేడాది ఇదే కాలంలో 22,11,457 యూనిట్ల ఎగుమతులు జరిగాయని తెలిపింది. లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాల్లో కొంత మందగమనం చోటు చేసుకున్నప్పటికీ తిరిగి పుంజుకోనున్నాయని సియామ్ ప్రెసిడెంట్ శైలేష్ చంద్ర పేర్కొన్నారు. పలు ఆఫ్రికన్ దేశాలు కరెన్సీ పతన సవాళ్లను ఎదుర్కొంటున్నాయని.. ఇవి వాహన సరఫరాలపై ప్రభావం చూపుతోందన్నారు. గడిచిన 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా 45 లక్షల యూనిట్ల ఎగుమతులు జరిగాయి.

రాజకీయ నేతలకు న్యాయ'కీర్తనలు' తప్పే

(మొదటి పేజీ తరువాయి)

చేయడంలో, అప్పీలు నిర్ణయాలలో ప్రజల సంకోచానికి దారి తీస్తుంది" అని ఆయన అన్నారు.

న్యాయ వ్యవస్థ ప్రభుత్వం శాసన, కార్యనిర్వాహక శాఖల నుండి స్వతంత్రంగా ఉండాలని జస్టిస్ గవాయ్ నొక్కిచెప్పారు. ఈ అధికార విభజన లేకపోతే న్యాయ నిష్పాక్షికతపై ప్రజల విశ్వాసాన్ని బలహీనపరుస్తుంది. న్యాయ వ్యవస్థను రాజకీయ ఒత్తిళ్ల నుండి నిరోధించాలనే రాజ్యాంగ నిర్మాతల ఉద్దేశాన్ని ఆయన గుర్తు చేశారు. న్యాయమూర్తులు తమ బహిరంగ ప్రవర్తనలో అత్యంత జాగ్రత్తగా ఎలా ఉండాలో ఆయన స్పష్టం చేశారు. ధర్మాసనంలో, వెలుపల న్యాయమూర్తి ప్రవర్తన అత్యున్నత నైతిక ప్రమాణాలను పాటించాలని అన్నారు. విశ్వాసం లోటుకు దోహదపడే కీలక సమస్యలలో ఒకటి కోర్టు విచారణలో జాప్యమని, సుదీర్ఘమైన వ్యాజ్యం విచారణ ఆర్థిక, మానసిక నష్టాన్ని సూచిస్తుందని అన్నారు. "ఆలస్యం చేయబడిన న్యాయం, న్యాయాన్ని తిరస్కరించడం కిందకు వస్తుంది" అనే పురాతన సూత్రాన్ని గుర్తు చేశారు. జాప్యాలు ప్రజలను పూర్తిగా న్యాయం కోరకుండా ఎలా నిరోధించవచ్చు" అని వివరించారు. న్యాయమూర్తి గవాయ్ జాప్యం హానికరమైన ప్రభావాలను స్పష్టం చేశారు. ప్రత్యేకించి క్రిమినల్ ట్రయల్స్‌లో, పొడిగించిన విచారణలు అమాయక వ్యక్తుల ముందస్తు నిర్బంధానికి, గౌరవాన్ని కోల్పోవడానికి దారితీస్తాయని అన్నారు. బాధితులకు, ఆలస్యాలు గాయాన్ని మరింత తీవ్రతరం చేస్తాయని పేర్కొన్నారు. సకాలంలో న్యాయం అందించే న్యాయ వ్యవస్థ సామర్థ్యంపై విశ్వాసాన్ని మరింత బలహీనపరుస్తుందని అన్నారు.

విశ్వాసం సన్నగిల్లడానికి దోహదపడే మరో అంశాన్ని ప్రస్తావిస్తూ, న్యాయ వ్యవస్థలో అట్టడుగు వర్గాలకు ప్రాతినిధ్యం లేకపోవడాన్ని జస్టిస్ గవాయ్ ఎత్తిచూపారు. నవంబర్ 2023లో సుప్రీం కోర్టు "స్టేట్ ఆఫ్ జ్యుడిషియరీ రిపోర్ట్"లోని భయంకరమైన గణాంకాలను ఆయన ఎత్తి చూపారు. ఇది జిల్లా న్యాయ వ్యవస్థలో భర్తీ చేయని పోస్టులలో 66.3 శాతం రిజర్వ్‌డ్ కేటగిరీల నుండి వచ్చాయని, షెడ్యూల్డ్ తెగలకు 84 శాతం పైగా సీట్లు ఖాళీగా ఉన్నాయని వెల్లడించిందని అన్నారు. న్యాయ వ్యవస్థ సమాజంలోని అన్ని వర్గాల ఆకాంక్షలను ప్రతిబింబించేలా ఉండాలని ఆయన ఉద్ఘాటించారు. అలా చేయడంలో విఫలమైతే ప్రాతినిధ్యం లేని సమూహాలను దూరం చేయవచ్చని, న్యాయ ప్రక్రియల్లో తమ గొంతులు తగినంతగా వినబడలేదని లేదా ప్రాతినిధ్యం వహించడం లేదని వారు భావించవచ్చని అన్నారు. మే 2019లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందిన జస్టిస్ గవాయ్ ప్రస్తుతం అత్యున్నత న్యాయస్థానంలో మూడో అత్యంత సీనియర్ న్యాయమూర్తి. జస్టిస్ కెజి బాలకృష్ణన్ తరువాత, సిజెఐ అవనున్న రెండో దళితుడు జస్టిస్ గవాయ్. జస్టిస్ సంజీవ్ ఖన్నా 2025 మే 3న పదవీ విరమణ చేసిన తరువాత, జస్టిస్ గవాయ్ సిజెఐగా పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన 2025 నవంబర్ 23 వరకు ఆ పదవిలో కొనసాగుతారు.

ఉన్మాది ఘాతుకానికి గురైన విద్యార్థిని మృతి

- నిందితుడిని కఠినంగా శిక్షించాలంటూ ప్రజాసంఘాల ఆందోళన
- నిందితుడి అరెస్టు : ఎస్‌పి హర్షవర్ధన్ రాజు

ప్రజాశక్తి – బద్వేలు, కడప అర్బన్

ఉన్మాది చేతిలో పెట్రోల్ దాడికి గురైన ఇంటర్ విద్యార్థిని దస్తగిరమ్మ (16) కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. బద్వేల్ శివారు ప్రాంతంలో ఉన్న సెంచరీ ప్లైవుడ్ పరిశ్రమ సమీపంలో విఘ్నేష్ అనే యువకుడు మాట్లాడాలని పిలిపి ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించిన విషయం తెలిసిందే. 80 శాతం కాలిన గాయాలతో ఆమెను కడప రిమ్స్‌కు తరలించారు. కొన ఊపిరితో ఉన్న దస్తగిరమ్మ మృత్యువుతో పోరాడి చివరికి ప్రాణాలు విడిచారు.

ఈ ఘటనలో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ హాలులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఘటనపై పోలీసులు తక్షణం చర్యలు చేపట్టారని, బద్వేల్ పట్టణం రామాంజనేయనగర్‌కు చెందిన జక్కల విఘ్నేష్‌ను ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు పట్టణ శివార్లలోని డిజిసి సమీపంలో బద్వేల్ రూరల్ సిఐ తన సిబ్బందితో కలిసి అరెస్టు చేశారని తెలిపారు. దస్తగిరమ్మ తనను పెళ్లి చేసుకోవాలని తరచూ కోరుతుండేదని, ఆ ఒత్తిడిని తప్పించుకునేందుకు ముందస్తు ప్రణాళికతో ఆమెపై పెట్రోల్‌తో దాడి చేశానని విచారణలో విఘ్నేష్ వెల్లడించాడని ఎస్‌పి చెప్పారు. నిందితుడిని కోర్టుకు హాజరు పరుస్తామని తెలిపారు.

నిందితుడికి త్వరితగతిన శిక్ష పడేలా సాక్ష్యాధారాలను సేకరించేందుకు పోలీసులు కసరత్తు చేస్తున్నారని చెప్పారు. నిందితులను త్వరితగతిన అరెస్టు చేసిన కడప పోలీసులను డిజిపి అభినందించారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి : ప్రజాసంఘాల డిమాండ్

విఘ్నేష్‌ను కఠినంగా శిక్షించాలని, బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కడప నగరంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా నాయకులు ఐఎస్ సుబ్బమ్మ, డివైఎఫ్ఐ నాయకులు వీరణాల శివకుమార్, రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు వీరపోగు రవి, బి దస్తగిరి రెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం రూ. 50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, ఆమె ఇంట్లోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.





కడప నగరంలో ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు (ఇన్‌సెట్‌లో) విద్యార్థిని దస్తగిరమ్మ (ఫైల్)

మరణ శిక్ష విధించాలి

బాలిక మృతికి కారకుడైన విఘ్నేష్‌కు మరణ శిక్ష విధించాలని ప్రజాసంఘాల ఐక్య వేదిక పట్టణ కన్వీనర్ కె. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేరస్తుడిని పట్టుకోవడంలో కృషి చేసిన పోలీసు అధికారులను అభినందించారు.

దిశ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి : ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

బాలికను అతి దారుణంగా చంపిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండాలని, దిశ చట్టాన్ని అమలు చేయాలని ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధా డిమాండ్ చేశారు. వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విచారణ వేగవంతం చేసి నిందితునికి కఠిన శిక్షపడేలా చేస్తే ఎవరైనా తప్పు చేయాలంటే భయం కలుగుతుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. సమావేశంలో బద్వేల్ మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్ రెడ్డి, వైసిపి నాయకులు సుందరరామిరెడ్డి, కొండు రమణారెడ్డి, కేశవరెడ్డి పాల్గొన్నారు.

విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు

- దస్తగిరమ్మ మృతి పట్ల సిఎం తీవ్ర విచారం

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

కడప జిల్లా బద్వేల్‌లో యువకుడు పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో తీవ్రంగా గాయపడిన దస్తగిరమ్మ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై 'ఎక్స్' వేదికగా ఆదివారం స్పందిస్తూ... ఎంతో భవిష్యత్తు ఉన్న ఒక విద్యార్థి దుర్మార్గుడి దుశ్చర్యకు బలికావడం తీవ్ర ఆవేదనకు గురి చేసిందన్నారు. ఈ ఘటనలో బాధిత కుటుంబానికి న్యాయం చేయడం అంటే... హంతకుణ్ని త్వరగా, చట్టబద్దంగా కఠినంగా శిక్షించడమేనన్నారు. ప్రత్యేక కోర్టులో ఫాస్ట్‌ట్రాక్ విధానంలో విచారణ పూర్తి చేసి నేరస్తుడికి మరణశిక్ష స్థాయి శిక్ష పడేలా చూడాలని అధికారులను సూచించారు. మహిళలు, ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు పాల్పడే వారికి ఇది ఒక హెచ్చరికగా ఉండాలన్నారు. ఈ ఘటనపై తాను పోలీసు అధికారులతో మాట్లాడానని చెప్పారు.

మహిళలకు ఏమాత్రం భద్రత లేదని ఈ ఘటన సూచిస్తోంది : ఐద్వా

బద్వేల్ ఘటన చూస్తే.. రాష్ట్రంలో మహిళలకు ఏమాత్రం భద్రత లేదని స్పష్టం చేస్తోందని ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు బి ప్రభావతి, డి రమాదేవి పేర్కొన్నారు. ఘటనపై సిఎం తక్షణం స్పందించడం హర్షణీయమే అయినప్పటికీ ఇలాంటి ఘటనలు ఎందుకు జరుగుతున్నాయని, వీటిని అరికట్టడానికి తీసుకుంటున్న చర్యలు ఏమిటనేది స్పష్టం చేయాలని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మహిళలు హింసకు గురికాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని కోరారు. ఒకటి, అర కేసులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు అప్పజెప్పడం, అరకొర సాయం ప్రకటించడం సమస్యకు పరిష్కారం కాదన్నారు. నిందితుడు విఘ్నేష్ ఇప్పటికే వివాహమైనప్పటికీ బాధితురాలిని ప్రేమ పేరుతో వేధించాడని, ఆమె తిరస్కరించడంతో ఈ ఘటనకు పాల్పడ్డాడని చెప్పారు. మహిళలకు రక్షణ కల్పించడం, వారిపై అఘాయిత్యాలను అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఒక కమిటీని వేయాలన్నారు. ఈ విషయాలపై గతంలో వర్మ కమిషన్ ఇచ్చిన సూచనలను అమలు చేయాలన్నారు. నిందితులు విఘ్నేష్‌తోపాటు అతని స్నేహితులు మరికొంత మంది టీనేజ్ అమ్మాయిలను లోబర్చుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నందున పోలీసులు ఈ కేసును మరింత లోతుగా విచారణ చేయాలని కోరారు. దోషిని కఠినంగా శిక్షించడంతోపాటు ఘటనలో మృతిచెందిన దస్తగిరమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకునేందుకు తక్షణ సాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను : పురందేశ్వరి

బద్వేల్ ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, బాధితురాలు చికిత్స పొందుతూ మరణించడం బాధాకరమని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, ఎంపి పురందేశ్వరి తెలిపారు. ఘటనపై 'ఎక్స్' వేదికగా ఆమె స్పందిస్తూ.. నేరస్తుడికి కఠిన శిక్ష పడేలా చూస్తామన్నారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు.

హిందుస్థాన్ జింక్‌కు రూ.2,327 కోట్ల లాభాలు

న్యూఢిల్లీ : వేదాంత గ్రూపునకు చెందిన హిందుస్థాన్ జింక్ లిమిటెడ్ (హెచ్‌జడ్ఎల్) 2024-25 సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో 34.5 శాతం వృద్ధితో రూ.2,327 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.1,729 కోట్ల లాభాలు ప్రకటించింది. ఇదే సమయంలో రూ.7,014 కోట్లు ఉన్న ఆదాయం.. గడిచిన క్యూ2లో రూ.8,522 కోట్లకు పెరిగింది. రూ.6,403 కోట్ల జింక్ అమ్మకాలు చేయగా.. వెండి ఇతర సెగ్మెంట్ల నుంచి రూ.1,550 కోట్ల ఆదాయం సమకూరినట్లు వెల్లడించింది.

క్వాష్ పిటిషన్‌ను వాపస్ తీసుకున్న డిప్యూటీ సిఎం పవన్

ప్రజాశక్తి–అమరావతి

వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ దాఖలైన పరువు నష్టం కేసును కొట్టివేయాలని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు నుంచి వాపస్ తీసుకున్నారు. క్వాష్ పిటిషన్‌ను ఉపసంహరించుకుంటానని, అందుకు అనుమతించాలని పవన్ దాఖలు చేసిన అత్యవసర పిటిషన్‌ను హైకోర్టు అనుమతించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు పవన్‌కల్యాణ్‌పై గత ప్రభుత్వం పరువు నష్టం కేసు దాఖలు చేసింది. ఈ కేసును కొట్టేయాలంటూ ఈ ఏడాది జులైలో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. తదుపరి చర్యలన్నీ హైకోర్టు గతంలోనే నిలిపివేసింది. పరువు నష్టం కేసులు అన్నింటినీ కూటమి ప్రభుత్వం ఉపసంహరణకు సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో క్వాష్ పిటిషన్ వాపస్ తీసుకునేందుకు అనుమతించాలని పవన్.. హైకోర్టును ఆశ్రయించారు. జనసేన అధ్యక్షులు హోదాలో గత ప్రభుత్వంలో వలంటీర్లపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో అప్పటి ప్రభుత్వం పరువు నష్టం దావా దాఖలు చేసింది.


ఖాజీపేటలో సిసి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మనోహర్

ఉచిత సిలిండర్లపై 23న నిర్ణయం

- మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి–తెనాలి (గుంటూరు జిల్లా)

ఉచిత గ్యాస్ సిలిండర్ల కేటాయింపు దీపావళి నుంచి ప్రారంభం అవుతుందని, ఇందుకు సంబంధించిన విధి విధానాలు ఈ నెల 23న జరిగే మంత్రివర్గ సమావేశంలో ఖరారు అవుతాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గుంటూరు జిల్లా తెనాలిలోని కాజీపేట, కఠెవరం, ఎరుకలపూడి, అంగలకుదురు గ్రామాలలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి, పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మకమైన సూపర్ సిక్స్‌లో మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి కేబినెట్ సమావేశంలో ఆమోదం లభించనుందని తెలిపారు. దీపావళితో ప్రారంభమయ్యే ఈ పథకం ప్రతి కుటుంబంలోనూ వెలుగు నింపుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. పథకం అమలుతో ప్రభుత్వంపై ఏడాదికి రూ.1000 కోట్ల వరకు భారం పడుతుందని తెలిపారు.



స్వచ్ఛభారత్ ప్రతిన
స్వచ్ఛభారత్‌లో భాగంగా విజయవాడలో సిఆర్ బిల్డింగ్స్ వద్ద ఆదాయపు పన్ను శాఖ నిర్వహించిన వాక్ మారథాన్ కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేస్తున్న సినీనటుడు సుధీర్, పిఐబి అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజిందర్ చౌదరి తదితరులు
- ఫొటో టివి రమణ

మహిళలు, బాలికలకు రక్షణ కల్పించలేకపోతున్న
ఇదేం రాజ్యం చంద్రబాబు ?

- వైసిపి అధినేత వైఎస్ జగన్

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మహిళలు, బాలికలకు రక్షణ కల్పించలేకపోతున్న ఇదేమి రాజ్యం చంద్రబాబూ? అంటూ వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రతిరోజూ ఏదో ఒకచోట అత్యాచారాలు, హత్యలు, వేధింపులు సర్వ సాధారణమైపోయాయని పేర్కొన్నారు. బద్వేలులో కళాశాల విద్యార్థినిపై పెట్రోల్ పోసి, నిప్పు పెట్టి ప్రాణాలు తీసిన ఘటన అత్యంత హేయం, దుర్మార్గం అని పేర్కొన్నారు. ఈ ఘటన వెనుక రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు వ్యవస్థల వైఫల్యం ఉందని ఆరోపించారు. వైసిపి మీద కక్ష పెట్టుకుని, తమ హయాంలో ప్రవేశపెట్టిన పథకాలు, కార్యక్రమాలను ఎత్తివేస్తూ రాష్ట్రం, ప్రజల మీద కక్ష సాధిస్తుండటం అన్యాయం కాదా? అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వ హయాంలో బాలికలు, మహిళల భద్రతకు పూర్తి భరోసానిస్తూ తీసుకొచ్చిన 'దిశ'ను ఉద్దేశపూర్వకంగా నీరుకార్చడం దీనికి నిదర్శనం కాదా? అని జగన్ ప్రశ్నించారు. దిశ ప్రారంభం మొదలు 31,607 మంది మహిళలు, బాలికలు రక్షణ పొందితే దాన్ని ఎందుకు దెబ్బతీశారు చంద్రబాబు అంటూ ఆయన ప్రశ్నించారు.

ఉపాధి పథకంలో అంకుడు, తెల్లపొణికి మొక్కల పెంపకం

- పిఆర్‌అండ్ ఆర్‌డి డైరెక్టరు కృష్ణతేజ

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో : ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు రూపొందించే హస్తకళల కళాకారులకు అవసరమైన అంకుడు, తెల్లపొణికి చెట్ల పెంపకం ఉపాధి పథకంలో చేపట్టేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సిద్ధమైంది. ఈ మేరకు అధికారులకు ఆ శాఖ డైరెక్టరు కృష్ణతేజ ఆదేశాలు జారీ చేశారు. ఏటికొప్పాక బొమ్మల తయారీకి అంకుడు, కొండపల్లి బొమ్మల తయారీకి తెల్లపొణికి చెట్ల కర్రను ముడిసరుకుగా కళాకారులు వినియోగిస్తారు. ప్రస్తుతం ఈ చెట్ల లభ్యత తక్కువగా ఉండటంతో కళాకారులు ముడి సరుకుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కళాకారులు ఈ సమస్యను గతంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సూచనల మేరకు అధికారులు ఏటికొప్పాక, కొండపల్లి ప్రాంతాల్లో ప్రభుత్వ, అటవీ, సామాజిక స్థలాల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా ఈ మొక్కలను పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

అక్షరం

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

4 | విజయవాడ
సోమవారం 21 అక్టోబర్ 2024



మనసు తెలుపని భాష
మంచి పెంచని భాష
ఉత్త సంద్రపు ఘోష
ఓ కూనలమ్మ

– ఆరుద్ర

డప్పు చప్పుళ్ళు

పోరాటం లేకుంటే మనుగడ లేదు
ప్రశ్న లేకుంటే సమాధానం రాదు
అడిగేవాళ్ళుండాలి
ప్రజల కలలేంటో తెలిసిన వాళ్ళుండాలి

విద్వేషాల తయారీదారులకు
సామాజికచేన్లో పడ్డ దొంగగొడ్లను
దుడ్డుగర్రతో తరిమేవాళ్ళంతా శత్రువులే
మందలోకి మృగం చొరబడిందని
గొంతెత్తేవాళ్ళంతా దేశద్రోహులే
బూర్జువా దొడ్డుగర్రకు కట్టిన
బానిసత్వం కట్లు విప్పాలనేవాళ్ళంతా అర్బన్ నక్సల్సే
మతరాజ్యానికి కులరాజ్యానికి
మారుమాట్లాడని ప్రజలుండాలి
రాజ్యం చంపాలనుకుంటే
ఎట్టైనా చంపుతుంది
ప్రశ్నల్ని భ్రూణహత్యలు చేస్తుంది
మహా కుట్రేదో చేసి
ఏదో సాకుతో కేసులు పెట్టి చంపుతుంది
ఎర్రజెండాల్ని, నల్లజెండాల్ని కాల్చేస్తుంది
కొంత దండును హతమారిస్తేనో
కొంతమందిని కటకటాల పాల్జేస్తేనో
ఆగిపోతుంది ఉద్యమం అనుకుంటారుకాని ఆగదు
నిప్పులా మరింత ఎరుపెక్కి
మరింత రగిలి
అగ్గిమీద డప్పు జజ్జరి జనారని గొంతు సవరించుకుని
డప్పు మీద ఉద్యమ దరువాగదు
పాటాగదు, ఆటాగదు
కళ్ళలో ఎర్రని మంటెరుపాగదు
ఎరుపు మనరక్తంలోనే వుంది!

– శాంతయోగి యోగానంద

అందమైన తోట!

అందులో సందేహమెందుకు?
జన సందోహం చూస్తే తెలియదా,
వింత పక్షుల సంకీర్తనలు వింటే చాలదా?
తోటమాలి పనిమంతుడు
సందర్శకుల సౌకర్యం చూస్తాడు
సిమెంటు బెంచీలు తీసి
చక్కని సోఫాలు వేస్తాడు
నీడనివ్వని చెట్లని కొన్ని
నింగిదాకా పెంచుతాడు
పండు విదల్చకున్నా
నిండుగా సాకుతాడు
పరిమళించని పొదలు
గుబురుగా పెరిగాయి
విరులు పూయని లతలు
పందిళ్లు తొడిగాయి
అందం ముఖ్యం కదా!
అరిచి గీపెట్టినా, మరీ తరచి చూడకు
డొక్కలు మాడిన మొక్కలెన్నో
మిక్కిలిగా ఉన్నాయి
గిడసబారిన చూపులతో
వెక్కిరిస్తుంటాయి
ఆశలెండిన ఆకులన్నీ
ఆకలి రాగాల్ని అందుకుంటాయి
నిన్ను సేద తీరనీయక
చేదు పాటల్ని వినిపిస్తాయి
ఎందుకా గోల?
సౌందర్యం చాలదా! సమదృష్టి ఏల?

– డా.డి.వి.జి. శంకరరావు
94408 36931.

అమరత్వం

నీ అడుగులు కనిపించాయి
ఆకాశం అరుణరంగు పులుముకొంది నేడు
గడిపిన దశాబ్ద కాలపు నీ జైలు జీవితం
చావు గురించి ఎంతో చెప్పింది
అడుగులురాని పసిపాపలా
నవ్వుతూ నడిచే సాహసి నువ్వు
స్వేచ్ఛకు రూపమిచ్చే క్రాంతి నువ్వు !
చావు పుట్టుకల అమరత్వం గురించి
నీ కంఠం చెప్పిన పాఠాలెన్నో ..
లక్ష్యాల్లోంచి అరాచక బతుకుల్లోకి
వచ్చిన విప్లవ గురువు నువ్వు
అరాచక స్థలం చిన్న బుచ్చుకుంటుంది
దొంగ కొడుకుల వేషాలు కొండెక్కుతాయి
నీ ఉద్యమం ఆగదు
నువ్వు నడుస్తూ ఉంటావు
పోరు బాట వైపు .. ఆకలి పొట్టల వైపు ..
దగాపడ్డ బతుకుల వైపు ..
నువ్వు నడుస్తూనే ఉంటావు
నువ్వు నడుస్తూ ఉంటావు !
నీ పాద చిహ్నాలు
ఎవరికి కనిపించకపోవొచ్చు
కానీ అవి వెతికే కళ్ళకి తప్పక కనిపిస్తాయి!

– అర్చన సిమ్మ, 8374334250

ప్రశ్నించిన చార్వాకం

ఆపాత అంతా మధురం కాదు
సనాతనం అంతా సమ్మతం కాదు
మానవతకు సార్థకత చేకూరాలంటే
మతతత్వాన్ని మట్టిలో కలపాలి
సత్యం శాంతి ప్రేమలకు
దోహదం చేసే ఆచారాలకు
కట్టుబడి ఉండగలిగితే
స్వేచ్ఛాజీవనంవైపు పయనించే
కార్యదక్షులవుతారు
సమాజానికిప్పుడేదీ కొత్తకాదు
సనాతనానికి ఆధునికతకు
నడుమ పోరాటాలు
గతకాలం నుండే ఆరంభం
ప్రభవించిన చైతన్యం
మరింతగా చిగురించాలి
మూఢత్వం పునాదులను
ప్రశ్నించిన చార్వాకం
మన సంస్కృతికి ప్రతిరూపమే
దుర్గుణాలను విడనాడి
సద్గుణాలను అలవరచుకోవడానికి
మానవధర్మమే మేలు
మానవ శక్తియుక్తులముందు
కరుడుగట్టిన విశ్వాసాలు
బలాదూర్ కాక తప్పదు
మనిషి బతుకుకు భరోసా ఇవ్వనివారు
మూఢనమ్మకాల ప్రచారంలో
ఎప్పుడూ ముందేవుంటారు
మోసపు మాటలను అవతలకి నెట్టేసి
తాతముత్తాతలనాటి సనాతనానికి
దాసోహం కాకూడదు
విజ్ఞానకాంతులు వెదజల్లే
శాస్త్ర పరిజ్ఞానాన్ని ప్రతి హృదిలో నింపాలి!

– పొత్తూరి సుబ్బారావు
94907 51681

జీవిత విషాదంపై సృజన స్వరం



ఈ ఏడాది సాహిత్యంలో నోబెల్ బహుమతి పొందిన హాన్ కాంగ్ (1970), మొట్ట మొదటి దక్షిణ కొరియా రచయిత్రి. గత 117 సంవత్సరాలలో సాహిత్యంలో 121 మంది నోబెల్ విజేతలలో, బహుమతి పొందిన 18వ మహిళ. 1993లో యూనివర్శిటీ గ్రాడ్యుయేషన్ తర్వాత, కల్చరల్ మ్యాగజైన్‌లో రిపోర్టర్‌గా పనిచేస్తున్నప్పుడు త్రైమాసిక సాహిత్య పత్రిక 'లిటరేచర్ అండ్ సొసైటీ', శీతాకాల సంచికలో నాలుగు కవితలను ప్రచురించడం ద్వారా కవయిత్రిగా తన సాహిత్య జీవితాన్ని ప్రారంభించింది. మరుసటి సంవత్సరం, ఆమె నవలిక 'రెడ్ యాంకర్' సియోల్ షిన్మున్ దినపత్రిక నిర్వహించిన సాహిత్య పోటీలో గెలుపొందడంతో, ఆమె నవలా రచయిత్రిగా అరంగేట్రం చేసింది. 1995లో, 25 సంవత్సరాల వయస్సులో, హాన్ తన మొదటి చిన్న కథల సంకలనం 'లవ్ ఆఫ్ యోసు'ని ప్రచురించింది. ఆమె తరువాత కొరియన్ సాహిత్య ప్రపంచంలో అత్యంత ప్రసిద్ధ నవలా రచయితల్లో ఒకరిగా పరిగణించ బడుతోంది. ఆమె ప్రారంభ రచనల నుంచి ఇప్పటివరకు, మానవ హింసను, అటువంటి హింస మూలంగా కలిగే గాయాలు, జీవిత విషాదాన్నే నిరంతరం అన్వేషిస్తూ వస్తోంది.

హాన్ కాంగ్ కవిత్వం, చిన్న కథలు ఆమె నవలల్లా వినూత్నమైనవి, ముఖ్యమైనవి. ఆమె కవిత్వం తరచుగా స్థలాలను (నగరం వీధిలో నడవడం), వస్తువులతో (వీధి దీపాలు, కొవ్వొత్తులు, అద్దాలు), విచ్ఛిన్నమైన మానవ శరీరం (చేయి చాచడం, చేతివేళ్లు, ఘనీభవించిన బుగ్గలు, నాలుకలు, కనురెప్పలు) లాంటి వాటిని అన్వేషిస్తుంది. నా మొదటి సంవత్సరంలో నేను కవిత్వం, కల్పన రెండూ ఒకేసారి రాయడం ప్రారంభించాను. నేను నా డెస్క్ దగ్గర కూర్చున్నప్పుడల్లా, ఇంతకు ముందు నేను రాసిన పద్యం రాయడం లేదా సవరించడం ద్వారా ప్రారంభిస్తాను. కవిత్వం మీద ఒక గంట గడిపిన తర్వాత, నేను మునుపటి రాత్రి పని చేస్తున్న నవల మీద దృష్టి సారిస్తాను. నేను నవలలు రాయడానికే ఎక్కువ సమయాన్ని వెచ్చిస్తున్నాను, కానీ నేను సంవత్సరానికి మూడు లేదా నాలుగు కవితలు రాయగలిగిన సందర్భాలు ఇప్పటికీ ఉన్నాయి' అని ఆమె చెప్పుకుంది. ఆమె వచనం సైతం కవిత్వం లానే ఉంటుందని నోబెల్ బహుమతి ప్రదాతలు సైతం పేర్కొన్నారు.

ఆమెకు గొప్ప సాహిత్య కుటుంబ నేపథ్యం ఉంది. ఆమె తండ్రి ఉపాధ్యాయుడు హాన్ సెయుంగ్–వోన్, ప్రసిద్ధి చెందిన నవలా రచయిత. కొరియా అత్యంత ప్రతిష్టాత్మకమైన కాల్పనిక పురస్కారాల్లో ఒకటైన యి సాంగ్ లిటరరీ అవార్డును గెలుచుకున్న మొదటి తండ్రీ–కూతురు ద్వయం వీరిద్దరూ. ఈమె అన్నయ్య, హాన్ డాంగ్–రిమ్ కూడా నవలా రచయిత. అంచాత ఆమె పుస్తకాలతో నిండిన ఇంటిలో పెరిగింది. "నాకు పుస్తకాలు సగం జీవులు, అవి నిరంతరం గుణించబడుతుంటాయి, వాటి సరిహద్దులను అవి విస్తరిస్తుంటాయి. నన్ను రక్షించే ఆ పుస్తకాలన్నిటికీ ధన్యవాదాలు" అని ఆమె చెప్పుకుంటుంది. ఆమె రచనలు అనేక భాషలలో అనువాదమయ్యాయి. అనేక అవార్డులొచ్చాయి. చలనచిత్రాలుగా సైతం వచ్చాయి. నోబెల్ బహుమతి ప్రకటన తరువాత కొరియాలో ఆమె పుస్తకాలు అమితంగా అమ్ముడు పోతున్నాయి. ఆమె కవితలు కొన్ని.

అద్దం గుండా శీతాకాలం

ఇపుడు వసంతోదయం నా నగరం
మీరు భూమి అంతర్భాగం గుండాలితే
కదలకుండా మధ్య నుండే వెళితే
ఆ నగరం కనిపిస్తుంది
అక్కడ సమయ వ్యత్యాసం
సరిగ్గా పన్నెండు గంటలు వెనక
సరిగ్గా అర సంవత్సరం వెనక కావున
ఆ నగరం శరదృతువు సాయంత్రం ఇపుడు
నిశ్శబ్దంగా ఎవరో ఒకరు వెంబడిస్తున్నట్టు అ
నగరం నన్ను అనుసరిస్తుంది
శీతాకాలం దాటడానికి రాత్రిని దాటడానికి
నేను నిశ్శబ్దంగా వేచి ఉంటాను
ఆ సమయంలో
ముందుకు దాటిపోతున్న ఎవరినో
నిశ్శబ్దంగా నా నగరం అధిగమిస్తుంది

2

అద్దం లోపల శీతాకాలం వేచి ఉంది
ఒక చల్లని ప్రదేశం
పూర్తిగా చల్లని ప్రదేశం
చాలా చల్లగా ఉంది
వస్తువులు వణకవు
(ఒకసారి ఘనీభవించిన) నీ ముఖం
పగిలిపోదు
నేను నా చేయి చాచను
నువు కూడా
నీ చేయి చాచడానికి ఇష్టపడవు
ఒక చల్లని ప్రదేశం
చల్లగా ఉండే ప్రదేశం
చాలా చల్లగా ఉంది
కనుపాపలు తడబడలేవు
కనురెప్పలకు/ ఎలా మూయాలో
తెలియదు (కలిసి)
అద్దం లోపల/ శీతాకాలం వేచి
ఉంది/
అద్దం లోపల/ నేను నీ కళ్ళను
తప్పించుకోలేను
నీకు నీ చేయి చాచడం ఇష్టం లేదు!

కొరియా భాష నుంచి ఆంగ్లానువాదం సోఫీ బౌమన్

వేకువన వినిపించిన పాట


వసంత కాంతి, విస్తరిస్తున్న చీకటి
మధ్య చీలికలో
మసకగా ప్రతిబింబిస్తూ
సగం చనిపోయిన ఆత్మ
నా పెదాలను నేను అణుచుకున్నాను
వసంతం వసంతమే
శ్వాస శ్వాసే/ ఆత్మ ఆత్మే
నా పెదాలను నేను అణుచుకున్నాను
ఎంత వరకు అది విస్తరిస్తోంది?
ఎంతవరకు అది వ్యాపిస్తోంది?
నేను వేచి ఉండాలి
ఒకసారి చీలిక మూసుకుపోయాక
పెదవులు విప్పాలి.
ఒకసారి నాలుక ద్రవీభవించాక
నేను నా పెదవులు తెరవాలి
ఇంకెప్పుడూ/ ఇంక మళ్ళీ ఎప్పుడూ!

కొరియా భాష నుండి
ఆంగ్లానువాదం బ్రదర్ ఆంథోనీ, యున్–గ్వి చుంగ్

– ముకుంద రామారావు
99083 47273

పురస్కారం

విభిన్న దృశ్యాల కథలు



కొత్త దృక్పథాలు, ఆలోచనలు, జీవన దృష్టి, అనువాదాల ద్వారానే పరివ్యాప్తం అవుతాయి. బహు భాషలకు నిలయమైన భారతవనిలో, భాషాజాతుల మధ్య భావ సమైక్యతకు దోహదం చేసినవి అనువాదాలే. తెలుగువారు ప్రారంభం నుంచి అనువాదంలో అభినివేశాన్ని చాటుతూ వచ్చారు. తెలుగు నాట మొదటి నుంచి అనువాదాన్ని కూడా మూల రచనగానే అంగీకరించడం, గౌరవించడం జరిగింది. ఇతర భాషల రచనల అనువాదం వల్ల తెలుగు సాహిత్యం గణనీయంగా ప్రభావితమైంది. 'సాహిత్య వికాసానికి, భావాత్మక ఐక్యతకు, నవీన భావజాలాల పరివ్యాప్తికి, భారతీయ భాషల మధ్య సమన్వయ సాధనకు, భిన్న భాషల్లోని సాహిత్యాల పరస్పర అనువాదం ఎంతైనా అవసరం' అంటారు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత వెన్నా వల్లభరావు. భారతీయ భాషల సాహిత్యం ఇంచుమించు అనువాదాలతోనే ప్రారంభమైంది. అనువాదం అంటే కథలనో లేదా రచనలనో వేరే భాషలోకి తర్జుమా చేయడం మాత్రమే కాదు. ఆయా ప్రాంతాల సంస్కృతి, జీవన స్థితిగతులు పాఠక ప్రపంచానికి అందజేయడం. మనిషి ఎన్ని ప్రాంతాలు తిరిగినా, మరెన్నో వింతలు విడ్డూరాలు చూసినా ఇంకా చూడాల్సినవి, తెలుసుకోవలసినవి మిగిలే ఉంటాయి. అలా మిగిలిన వాటిల్లో కొన్నిటిని తమదైన శైలిలో మనకు అందజేయడమే అనువాదం.

శ్రీమతి కల్పనా కోనేరు వృత్తి రీత్యా విశ్రాంత వ్యాయామోపాధ్యాయిని. స్వతంత్ర రచనలు చేయడంలో అందె వేసిన చెయ్యి. మనవడికి హిందీ నేర్పడం కోసం, ఆనాడు తాను పనిచేస్తున్న ప్రాంతంలో ఉపాధ్యాయులకై వెతకగా ఎవ్వరూ కానరాలేదు. సహజంగానే ఉపాధ్యాయురాలు, ఇంకేముంది? నేనే నేర్చుకుంటే పోలా! అనుకుంటూ ముందుగా తాను నేర్చుకుని, తన మనవడికి నేర్పడం ప్రారంభించారు. ఆమెలోని రచయిత ఊరుకోనిస్తుందా? హిందీ సాహిత్యంతో అనుసంధానించింది. అనువాద రచయితగా మార్చింది. ప్రేమ్ చంద్, విశ్వంభర్ నాథ్ కౌశిక్, మహా దేవి వర్మా, ఆగ్నేయ్, హరి శంకర్ పరసాయి, సుదర్శన్, మన్నూ భండారి, అన్నపూర్ణా నంద్ వర్మ, కృష్ణ చందర్ లాంటి హిందీ కథా రచయితల విశిష్ట మైన కథలను చాలా సమర్థవంతంగా తెలుగు చేశారు.

'దర్పణం' పేరిట పన్నెండు కథల సంపుటిని తెలుగు పాఠకులకు అందించారు. ఈ సంపుటిలో మొదటి కథ ప్రసిద్ధ హిందీ రచయిత శ్రీ కృష్ణ చందర్ రచనను 'బాధ్యత' పేరుతో మన ముందుకు తెచ్చారు. ప్రభుత్వ యంత్రాంగంలోని బాధ్యతా రాహిత్యాన్ని బట్టబయలు చేసి, జీవితంలో ప్రతి మనిషి ప్రభుత్వ కార్యాలయానికి వెళ్ళినప్పుడు ఎదురయ్యే శాఖల పరిస్థితులు, పనితీరుపై వ్యంగ్యాస్త్ర, హాస్యపు పూతతో ఆవిష్కరించారు. చివర్లో కథ విషాదాంతంతో మనస్సు బరువెక్కిస్తుంది. ఇద్దరు స్నేహితురాళ్ళ వైవిధ్యమైన వ్యక్తిత్వాల మధ్య సమాజంలోని అనాథల సమస్యకు మానవత్వ ప్రతిరూపమే 'ఇద్దరు కళాకారులు' కథ. 'శరణ దాత' కథ దేశ విభజన నాటి పరిస్థితులకు దర్పణం పట్టి మానవత్వపు విలువల్ని చాటి చెప్పింది. ఇది సచ్చిదానంద హీరానంద వత్యయన్ రచన. హిందూ ముస్లింల మధ్య, అప్పటి తరం ప్రేమ, వాత్సల్యాలను తెలియచెబుతోంది ఈ కథ. మున్ని ప్రేంచంద్ రాసిన 'మంత్ర'ను 'క్రమశిక్షణ' పేరుతో అనువదించారు. క్రమశిక్షణ అనేది వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవడానికే కానీ అది ఏ వ్యక్తిని శిక్షించడానికి కాదని, అదో కిరీటం కాదని ఈ కథ వివరిస్తుంది. 'తాయీ' కథ సంతానం లేని మహిళల ప్రవర్తనకు అద్దం పడుతూనే, ప్రేమ, ఆపేక్షలలో స్త్రీలను అగ్రస్థానం ఇవ్వడం వాస్తవికంగా తోస్తుంది. ఓంప్రకాష్ వాల్మీకి కథను 'వలసజీవులు' పేరుతో అందించారు. ఈ సంపుటిలో అగ్రస్థానం ఈ కథదే. నాటి నుండి నేటి వరకు పెట్టుబడి శ్రమను దోచుకోవడం, శ్రామిక స్త్రీ యజమాని సొత్తు అన్న భావజాలం నేటికీ సజీవంగా ఉండడం కఠోర వాస్తవం. 'అంతులేని కథ శ్రామికుల ఆకాంక్షలు, వాటిని అందుకునే మార్గంలో ధన మదాంధులైన యజమానుల వైఖరి వల్ల వ్యధలను భవించే మహిళల కన్నీళ్ల కథ. తమకొక చిన్న గూడు ఏర్పరుచుకోవాలన్న చిన్న కోరిక కోరుకునే మహిళ కథ. కడు పేద విద్యార్థి గురు దక్షిణగా పుచ్చకాయ సమర్పిస్తే, ఆనందపరవశురాలైన పంతులమ్మ కథ మరొకటి. వెరసి ఈ పన్నెండు కథలు పాఠకులకు పన్నెండు విభిన్న పరిస్థితులను కళ్లకు కడతాయి, ఆలోచింపచేస్తాయి.

అనువాదకురాలిగా తన తొలి ప్రయత్నంలోనే పేరెన్నిక గన్న హిందీ రచయితల కథలను ఎంచుకోవడం కోనేరు కల్పన పట్టుదలను సూచిస్తుంది. దీనివల్ల తెలుగు పాఠకులకు ఉత్తర భారతదేశ సంస్కృతి తెలియచెప్పడంలో తన వంతు పాత్రను పోషించారు. అభిరుచి వున్న పాఠకులకు షడ్రసోపేత విందు చేసారనడంలో అతిశయోక్తి లేదు. హిందీ నుంచి తెలుగు భాషలోకి అనువదించి నట్లు గానే, మన తెలుగు సాహిత్యంలోని ఆణిముత్యాల్లాంటి రచనలను హిందీ భాషలోకి అనువదించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే తెలుగు వారి సంస్కృతీ సంప్రదాయాలను, ఇక్కడి స్థితిగతులను., వర్తమాన సమాజపు సంఘర్షణను, మన రచయితల సృజనను ప్రపంచానికి చాటిన వారమవుతాము.

– కటుకిల రాంబాబు
74162 64747

రాయలసీమ కవిరత్నం విద్వాన్ తలమర్ల కళానిధి



'ఆ చల్లని సముద్ర గర్భం దాచిన బడబానలమెంతో
ఆ నల్లని ఆకాశంలో కానరాని భాస్కరులెందరో' అని దాశరథి అన్నట్లుగా– తెలుగు సాహిత్య వినీలాకాశంలో కానరాని, అంటరాని కవిభాస్కరులెంతోమంది ఉన్నారు. ఆధునిక సాహిత్య చరిత్రకారులు విస్మరించిన విశిష్టకవి తలమర్ల కళానిధి. రాయలసీమ ప్రాంతానికి చెందిన తలమర్ల కళానిధి పద్యం, వచనం, కథ, వ్యాసం, అనువాదం లాంటి వివిధ ప్రక్రియల్లో దాదాపు 30 గ్రంథాలు రచించారు. కల్లూరి అహోబిలరావు లాంటి ఒకరిద్దరు తప్ప కళానిధి సాహిత్య వరివస్యను మిగతా విమర్శకులెవరూ పట్టించుకోలేదు. లలిత కవి కోకిల, కవిరత్న బిరుదాంకితుడైన కళానిధి అనంతపురం జిల్లా తలమర్లలో 1915 సంవత్సరంలో ఓబమ్మ, ఓబన్న దంపతులకు జన్మించాడు. చేనేత వృత్తితో జీవనం సాగించే మాల సామాజిక వర్గంలో పుట్టిన కళానిధి ఎన్నో అవరోధాలను అధిగమించి, అచంచలమైన సంకల్పదీక్షతో నిరంతరకృషితో పండితకవిగా ప్రఖ్యాతి గాంచాడు. బడి కిటికీ వెలుపల నుంచి పాఠాలను ఆలకించి, ఇసుకలో అక్షరాలు దిద్దుకొని, ఓబులేసు మాస్టారు ప్రోత్సాహంతో కళానిధి విద్యనభ్యసించాడు. తలమర్ల, కొత్త చెరువు, బుక్కరాయ సముద్రం, అనంతపురం తదితర ప్రాంతాల్లో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడిగా తెలుగుపండితునిగా కళానిధి అంతేవాసుల ప్రేమను, సహోద్యోగుల మన్ననలందుకు న్నాడు. విద్యార్థిగా వున్నప్పుడే స్నేహితురాళ్లకు ప్రేమలేఖలు రాయడం, వేదాంతం నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగే 'సజ్జనప్రబోధక సమితి' సభల్లో మాట్లాడటం, అనేక అంశాలపై వ్యాసాలురాయడం లాంటి కార్యక్రమాల వల్ల కళానిధి సాహిత్యాభిరుచిని పెంపొందించుకున్నాడు. నరసింహారెడ్డి సహకారంతో, ఛందస్సు నేర్చుకొని, బళ్లారి శ్రీనివాసమూర్తి మార్గదర్శనంతో పద్యరచనా పద్ధతులను అలవరుచుకున్నాడు. 1936 భారతి మాసపత్రికలో 'తన్మయము' గేయం, తరువాత సాధన పత్రికలో లేమి పద్యకవిత ప్రచురింపబడటంతో కవిగా కళానిది. ప్రస్థానం ప్రారంభమయింది. ఆనాటి జాతీయోద్యమ సాహిత్యం, హరిజనోద్యమ సాహిత్యం, భావకవిత్వోద్యమం, అభ్యుదయ ఉద్యమ ప్రభావం కళానిధి కవిత్వంలో కనబడుతుంది. విద్వాన్ పరీక్ష రాయకముందే ఆయన కళాసౌధం (1960) ఖండకావ్యం రాశాడు. ఈ కావ్యాన్ని నీలం సంజీవరెడ్డికి అంకితమిచ్చాడు.

గ్రామంలో పుట్టడం వల్ల సహజంగానే కళానిధి బాల్యం ప్రకృతి ఒడిలో గడిచింది. తలమర్ల పరిసర ప్రాంతంలోని వాగులూవంకల్లో కాలం గడపటం, ఇసుకతిన్నెల మీద ఆడుకోవటం, గూడొంక గట్టున ఉన్న ఈత చెట్ల నీడలో, పంటపొలాల్లో సేదదీరటం వల్ల ఆయన బాల్యానుభూతులు ప్రకృతితో పెనవేసుకున్నాయి. కీట్స్ తరహా కవిత్వం రాసే తన గురు మిత్రుడు బళ్లారి శ్రీనివాసమూర్తి సాహిత్య సాంగత్యం కారణంగా ప్రారంభదశలో కళానిధి అచ్చమైన భావకవిలా పద్యరచన చేశాడు. రాచపాళెం చంద్రశేఖరరెడ్డి అన్నట్లుగా కళాసౌధంలో చాలా ఖండికలు ప్రకృతి సౌందర్య వర్ణనాత్మకాలు, గ్రామీణ జీవన ప్రదర్శనాత్మకాలు. రాయలసీమలోని పంటపొలాల అపురూప దృశ్యాలను, వ్యవసాయ వాతావరణాన్ని కళానిధి అద్భుతంగా కవిత్వంలో దృశ్యమానం గావించాడు. 'రామణీయక మెగబోయు రాగిపోలము', 'పండి బంగారు ఛాయల పరగుచుండు శాలిభూములు', 'నిండుజవ్వన మొలుకుచుండెడి జొన్నచేలు', 'ఉల్లమలర పుష్పించే రెల్లుపొదలు,' నిండుపున్నమి రేయిదండిగా బూచే చేమంతి పొదరిండ్లు', 'సొంపెసలార సంపంగి తీవలు, 'మిసమిసలాడు చిక్కుడు పొదరిండ్లు' ఇత్యాది మనోహర క్షేత్ర దృశ్యాలను భావపరిమళ భరితంగా కళానిధి వర్ణించాడు. కాల్వగట్టున పొదలలో కాంతులీనే మిణుగురు పురుగులను, పంటకాలువలో ప్రభలు చిమ్మే చందమామ ప్రతిబింబాన్ని, వనములలో ఇంపుగా పాడే వానకోయిలలను తన పెన్నుకెమెరా కన్నుతో కళానిధి రసరమ్యంగా బంధించాడు. రాయలసీమ అందాలనే కాకుండా కరువు పరిస్థితులను, ఈ ప్రాంత జీవన వాస్తవికతను, స్థానీయముద్రతో కళాతత్త్వ భరితంగా తన కవిత్వంలో ఆవిష్కరించాడు. 'వెంకమ్మల గురించి, బుచ్చమ్మల గురించి ఇంకెంతకాలం రాస్తారు? మిగతావర్గాల మహిళల గురించి ఎందుకు పట్టించుకోరు?' అని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు కవులను ప్రశ్నించాడు. ఈవిధమైన సృజన పరిణితితో కళానిధి శ్రామికస్త్రీల కష్టనష్టాలను, వారి శ్రమవిలువను తన పద్యాల్లో ఆర్ద్రంగా అక్షరబద్ధం చేశాడు. 'ఘర్మబిందువులెల్ల గండభాగములందు/ రాలుగా కష్టించే రైతువనిత'లను, 'నడికట్టు బిగియించి నడినెత్తిపై పైటచుట్టగా నమరిచి కంకరమోయు కార్మికస్త్రీలను, కాలాన్ని జయించి పాటు పడే కూలి తల్లుల త్యాగ నిరతిని అపురూపంగా పద్యాల్లో చిత్రించాడు. మహిళాప్రగతితోనే సమసమాజం సిద్ధిస్తుందని దార్శనిక దృష్టితో ప్రతిపాదించాడు. 'ధూళిలో వీధుల్లో దొరలే దివ్యాంగులను, ఆకలి కోర్వలేక అల్లాడి ఆకులు మేసే అభాగ్యులను, ఎండలో వానలో పరిశ్రమించే పసులకాపరులను, తన పద్యపల్లకిలో కళానిధి ఊరేగించాడు. 'నీవు ధన్యుడవోయి సైరికా! నీవు పుణ్యుడవోయి కర్షకా!' అంటూ కర్షకుల ఔన్నత్యాన్ని సమున్నతంగా కవిత్వీకరించాడు. దేశం కోసం యుద్ధంలో ప్రాణాలను తణ ప్రాయంగా విడిచి పెట్టే వీరసైనికులకు తన పద్యాలతో నీరాజనాలు పలికాడు. 'దున్నేవాడిదే భూమి, దున్ననివాడిది కాదని' కళానిధి ఆనాడే నినదించడం విశేషం. ఎటుజూచినా హింసాకండలు, దౌర్జన్యాలు, దోపిడీలు, ద్రోహాలు, అసూయద్వేషాలు, అరాచకాలు,ఆకలిమంటలు సమాజంలో అనునిత్యం పెరిగిపోతున్నాయని తన కవిత్వంలో ఆవేదన వ్యక్తం చేశాడు. 'తిరుగు లేని బ్రహ్మాస్త్రంబు తరుగులేని / దివ్యసంపద మీ ఓటు, భవ్యమైన/ విలవగలదంచు తలపోసిమెలగుడయ్య" సరళ సుందరమైన పద్యాలతో కళాసౌధం కావ్యంలో ఓటు విలువను ప్రబోధించాడు. 'దేశపు పునాదులకే ఓటు దివ్యరక్ష', 'ఓటు రాజ్యాధికారంబు నొసగునౌర' అంటూ అమూల్యమైన ఓటు శక్తినిగూర్చికవి జాతికి హితవు చెప్పాడు కవి .

1937 నుంచి 78 వరకు వివిధ సందర్భాల్లో తాను రాసిన చిన్న కథలతో 'కథానిధి కథాలహరి' అనే శీర్షికతో ఒక సంపుటిని వెలువరించాడు. ఈ కథలన్నీ పరిణామంలో చిన్నవైనప్పటికీ, అనేక సామాజిక సమస్యలను స్పృశిస్తూ ఆసక్తిదాయకంగా తీర్చిదిద్దాడు. మడి కోత, పరివర్తనం, నీవే దిక్కు, కుముద లాంటి చిన్న కథలు చదివితే ఆనాటి గ్రామీణ బతుకుల స్థితిగతులు అర్థమవుతాయి. కులం, పేదరికం కారణంగా అణగారిన వర్గాలు ఎదుర్కొనే జీవన సంక్షోభాన్ని, ప్రాబల్య వర్గాల ఆధిపత్య సంస్కృతిని, మానవ సంబంధాల తీరుతెన్నులను, సామాజిక, ఆర్థిక దోపిడీ తత్త్వాన్ని తన కథల్లో కళానిధి సముచితంగా చిత్రించాడు. ఎల్లమ్మ, గంగులు, సుంకమ్మ, పాపమ్మ పాత్రల ద్వారా దళిత, బహుజన స్త్రీలు అనుభవించే దుర్భరమైన లైంగిక హింసను, శ్రమ దోపిడిని, రోసిరెడ్డి, జంగిలీ సాబ్ లాంటి పాత్రలతో భూస్వామ్య వ్యవస్థ దుర్నీతిని కళ్ళకు కట్టినట్లుగా కథల్లో వివేచించాడు. రైతు కూలీల మధ్య రగిలే వైషమ్యాలను, వర్గ వైరుధ్యాలను ఆలోచనాత్మకంగా కథల్లో చర్చించాడు. కళానిధి రచనల్లో 'నేనే అస్పృశ్య భూతాన్ని' అనే చిన్న నాటిక అసమసమాజ దుష్ట స్వభావానికి తార్కాణంగా నిలుస్తుంది. తన గదిలో కూర్చొని 'అంటరాని భూతమా! మంటగలిసిపో' అంటూ పాట పాడుకుంటున్న ఒక కవి ఇంటిలోకి అస్పృశ్యతా భూతం ప్రవేశిస్తుంది. ఇందులో కవికీ, మహానాయకునికీ, భూతానికీ మధ్య పదునైన సంవాదంతో ఈనాటిక సాగుతుంది. కులసమస్య, సమాజంలో దాని సుస్థిరమైన మనుగడ, కుల నిర్మూలనకు అవసరమైన కార్యాచరణ గురించి ఈ నాటిక లో చర్చించాడు రచయిత. మహానాయకునితో ఈ భూతం సంభాషించే సందర్భంలో అంటరాని తనానికి సంబంధించిన మౌలిక అంశాలను లేవనెత్తాడు కళానిధి. కులాన్ని రూపుమాపాలనే ఆదర్శాలను వల్లించే రాజకీయ నాయకులు, మహామంత్రులు, బడానేతలు తమ ఇంటినుండి అసమానతలను తరిమికొట్టే కార్యాచరణ ప్రారంభించాలని, తమ వారసులకు కులాంతర వివాహాలు చేయాలని భూతం ఎత్తిపొడుస్తుంది. దళితులపై నిత్యం దాడులు, దళిత స్త్రీలపై అత్యాచారాలు జరగని రోజున తాను అదృశ్యమవుతానని భూతం హామీ ఇస్తుంది. అరవై యేళ్ళ క్రితం రాసిన ఈ నాటికలో కులభూతం చెప్పిన మాటలకు నేటికీ ప్రాసంగికత ఉంది. ఇదే సమస్యమై రాసిన 'హరిజనోద్ధరణ', 'వర్ణాంతర వివాహాలు' నాటికల ద్వారా దళిత చైతన్యాన్ని చాటిచెప్పాడు. జాతి ప్రగతికి తీరని కళంకములైన వరకట్నం, భిక్షక సమస్య, మద్యపానం, పురుషాధిపత్యం లాంటి దురాచారాలను ఖండిస్తూ కళానిధి రాసిన వ్యాసాల్లో ఆయన ఆధునిక దృష్టి కనిపిస్తుంది.

తలమర్ల కళానిధి గొప్ప పండితుడు, అనువాదకుడు కూడా. సంస్కృత, తెలుగు భాషా సాహిత్యాలను ఆయన ఇష్టంగా ప్రగాఢంగా అధ్యయనం చేశాడు. సామాన్య పాఠకులుకూ కవి పండితులకు గూడా సదావగాహన కలిగించే విధంగా మణిమనోహరులు, మాధవదాసు, అమర మూర్తులు, శివానందలహరి, సౌందర్యలహరి, ఫిరదౌసి, నవనాథ చరిత్ర, నీతి రత్న నిధి, వాశిష్ట రామాయణ సూక్తినిధి లాంటి వచన గ్రంథాలను రచించాడు. వాల్మీకి రామాయణంలోని అయోధ్య, అరణ్య, కిష్కింధ, యుద్ధకాండలను 'శ్రీరామాయణనిధి' రెండు భాగాలు పేరుతో అవగాహనాయోగ్యంగా వచనంలోకి అనువదించాడు. సంస్కృతంలో లీలాశుకుడు రాసిన శ్రీ కృష్ణకర్ణామృతం కావ్యాన్ని 'మధుకణాలు' పేరుతో కళానిధి తెలుగులోకి అనువదించాడు. రామకృష్ణ పరమహంస జీవిత చరిత్రను 'దక్షిణేశ్వర భాగవతం' కావ్యంగా రచించాడు. మంజరీ ద్విపద పద్యాల్లో పన్నెండు స్కంధాలుగా రాయబడిన ఈ కావ్యం కళానిధికి ఎంతో పేరుప్రఖ్యాతులను సమకూర్చిపెట్టింది. రాళ్ళపల్లి అనంతకష్ణశర్మ, పుట్టపర్తి నారాయణాచార్యులు, జమ్మలమడక మాధవరామశర్మ, యన్.గోపి తదితర కవిపండితులు కళానిధి కావ్యకళావైభవాన్ని ఆయన గ్రంథాలకు రాసిన ముందుమాటల్లో కొనియాడారు. బైరపురెడ్డి నారాయణరెడ్డి, కుంటిమద్ది శేషశర్మ, పాలా వెంకటసుబ్బయ్య తదితర రాయలసీమ ప్రాంతానికి చెందిన పద్యకవుల బాటలో, గుర్రం జాషువా, కరుణశ్రీ వంటికవుల స్ఫూర్తితో శిల్పసుందరమైన కవిత్వంరాసిన కళానిధి, ఆశావాది ప్రకాశరావులాంటి తన తరువాతతరం పద్యకవులకు ప్రేరణగా నిలిచాడు.'. ఉదాత్త వస్తు సంభరితమైన ఎన్నో కృతులను సాహిత్యలోకానికి అందించటం'తో పాటు మరెన్నో సన్మానాలను, బిరుదులను కూడా కళానిధి అందుకున్నాడు. 2000 సంవత్సరం వరకు నిరంతరం సాహిత్య వ్యాసంగంలో మునిగితేలిన తలమర్ల కళానిధి మలిదశలో ఆధ్యాత్మిక రచనలవైపుగా చూపు సారించాడు. అందువల్లనే ఎనభయ్యో దశకం తరువాత పోటెత్తిన అస్తిత్వ ఉద్యమాల సాహిత్యస్ఫూర్తిని, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆలోచనా భావధారను ఆయన అందిపుచ్చుకోలేకపోయాడు. ఇలాంటి పరిమితులను మినహాయిస్తే, పండితునిగా పద్యకవిగా, రచయితగా, నాటకకర్తగా, అనువాదకునిగా ఆధునికసాహిత్యంలో తలమర్ల కళానిధి బృహత్తరమైన పాత్ర పోషించాడు. బహుముఖీనమైన కళానిధి సాహిత్య కృషి గురించి సమగ్ర పరిశోధన జరగవలసిన అవసరముంది.

– డాక్టర్ కోయి కోటేశ్వర రావు
94404 89274

వైద్యారోగ్య సిబ్బందికి భద్రత కరువు!

- 50 శాతం మందికి మించి హెల్త్‌కేర్ వర్కర్ల అభిప్రాయమిదే
- సేఫ్టీ ఏర్పాట్లు సరిపడా లేవని అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని ఆర్జీ కర్ ఆస్పత్రిలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటన దేశాన్ని కుదిపేస్తున్నది. ఇప్పటికీ అక్కడ వైద్యులు నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. పని చేసే చోట తమకు భద్రత లేదని వారు పేర్కొంటున్నారు. బెంగాల్ వైద్యుల ఆందోళనకు దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తున్నది. ఈ నేపథ్యంలోనే వైద్యారోగ్య సిబ్బందికి వారు పని చేసే చోట భద్రత ఎలా ఉన్నది అనే విషయాలను తెలుసుకోవడానికి ఓ అధ్యయనం నిర్వహించారు. ఇందులో కీలక విషయాలు బయటపడ్డాయి.

50 శాతానికి మించి వైద్యారోగ్య సిబ్బంది తాము పని చేసే చోట సురక్షితంగా ఉన్నట్టు ఫీల్ కావడం లేదని ఈ సర్వేలో తెలిపారు. వర్ధమాన్ మహావీర్ మెడికల్ కాలేజీ, సఫ్దర్‌జంగ్ హాస్పిటల్, ఢిల్లీ ఎయిమ్స్‌లు సంయుక్తంగా నిర్వహించిన ఈ అధ్యయనంలో వైద్యారోగ్య వ్యవస్థలో సిబ్బందికి కల్పించే భద్రతలోని లోపాలు బయటపడ్డాయి. దేశవ్యాప్తంగా విభిన్న మెడికల్ ఇన్‌స్టిట్యూషన్స్ నుంచి మొత్తం 1,566 మంది హెల్త్ కేర్ వర్కర్స్ (869 మంది మహిళా, 697 పురుష వర్కర్లు) నుంచి శాంపిల్స్ తీసుకుని ఈ సర్వే రూపొందించారు. ఇందులో ఫ్యాకల్టీ సిబ్బంది, నర్సింగ్ స్టాఫ్, మెడికల్ ఆఫీసర్స్, సపోర్టింగ్ స్టాఫ్, మెడికల్ స్టూడెంట్స్, ఇంటర్న్‌లు అందరి నుంచీ వివరాలను తీసుకున్నారు.

దాదాపు సగం మంది వర్కర్లకు ప్రత్యేకంగా డ్యూటీ రూమ్‌లు లేవు. సుదీర్ఘమైన గంటలు డ్యూటీలోనే ఉండాల్సి వస్తున్నది. కొన్నిసార్లు రాత్రిపూట కూడా ఉండాల్సి వస్తున్నది. ఇది వరకు అందుబాటులో ఉన్న డ్యూటీ రూమ్‌లలో సరిపడా స్పేస్, వెంటిలేషన్ లేక, చెదలు పట్టి, శుభ్రత లేకుండా ఉన్నాయి. 70 శాతం మంది వర్కర్లు తమకు అసమర్థ సెక్యూరిటీ సిబ్బంది ఉన్నదని భావిస్తున్నారు. 62 శాతం మంది ఎమర్జెన్సీ అలారమ్ సిస్టమ్ తగిన విధంగా లేదని చెప్పారు. సర్వైలెన్స్, హైరిస్క్ ప్రాంతాలైన ఐసీయూ, సైకియాట్రిక్ వార్డుల్లో పటిష్టమైన సెక్యూరిటీ లేదని, కంట్రోల్ యాక్సెస్ కూడా తమకు లేదని వివరించారు. ఆయుధాలు, ప్రమాదకర ఆయుధాలను లోనికి రాకుండా అడ్డుకునే పరిస్థితులూ 90 శాతం సంస్థల్లో లేవని చెప్పారు. ప్రభుత్వ వైద్య సంస్థల్లో కంటే ప్రయివేటు వాటిలో మంచి భద్రత ఉన్నదని భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల కంటే రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో పరిస్థితులు ఇంకా దారుణంగా ఉన్నాయని పేర్కొన్నారు. 70 శాతం మంది ఎమర్జెన్సీ అలారమ్ సమర్థవంతంగా లేవని రిపోర్ట్ చేశారు. 81.3 శాతం మంది హెల్త్ కేర్ వర్కర్లు తాము హింసను ఎదుర్కొన్నట్టు తెలిపారు. హింస ఎదుర్కొన్న వారిలో 44.1 శాతం మంది.. ఆ ఘటనలను సరిగ్గా హ్యాండిల్ చేయలేకపోయారని భావిస్తున్నారు. ఎమర్జెన్సీ పరిస్థితుల్లో ఎవరిని కాంటాక్ట్ చేయాలో కూడా 80 శాతం మందికి తెలియదని ఈ సర్వే తేల్చింది. సెక్యూరిటీకి సంబంధించి ఆందోళనకర విషయాలను రిపోర్ట్ చేసే రహస్య పద్ధతి 70 శాతం మందికి అందుబాటులో లేదు. ఈ సమస్యలను పరిగణనలోకి తీసుకోవాలని ఈ అధ్యయన కమిటీ సూచించింది. హై రిస్క్ ఏరియాల్లో సెక్యూరిటీ పెంచాలని, సెక్యూరిటీ సిబ్బంది పెంచాలని, డ్యూటీ రూమ్ పరిస్థితులు మెరుగుపరచాలని, హింసను ఎలా ఎదుర్కోవాలో సూచించే స్పష్టమైన ప్రొటోకాల్స్‌ను రూపొందించి అమలు చేయాలని సిఫారసులు చేసింది.

సురేష్ గోపీకి 'కుల నిర్మూలన' పుస్తకం

- పూర్తి బ్రాహ్మణుడిగా పుట్టాలన్న వ్యాఖ్యల నేపథ్యంలో విద్యార్థుల నిరసన

కోల్‌కతా : వచ్చే జన్మలో పూర్తి బ్రాహ్మణుడిగా పుట్టాలని పేర్కొన్న కేంద్ర మంత్రి సురేశ్ గోపిక్, డా. బిఆర్ అంబేద్కర్ రచించిన కుల నిర్మూలన పుస్తకాన్ని విద్యార్థులు అందజేశారు . కోల్ కతాలోని సత్యజిత్ రాయ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు ఆ సంస్థ చైర్మన్ సురేష్ గోపికి ఈ పుస్తకాన్ని అందజేశారు. సురేష్ గోపి ఇక్కడి ఇన్‌స్టిట్యూట్‌ను సందర్శించడానికి వచ్చినప్పుడు విద్యార్థుల వైపు నుండి అలాంటి కదలిక వచ్చింది. విద్యార్థుల ఈ పని సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. బ్రాహ్మణాధిపత్యానికి వంతపాడిన సురేశ్ గోపీకి ఇది గట్టి సమాధానం అన్న రీతిలో సోషల్ మీడియాలో చర్చ జోరుగా సాగుతోంది. వచ్చే జన్మలో పూర్తి బ్రాహ్మణుడిగా పుట్టాలని సురేష్ గోపి చేసిన ప్రకటన అంతకుముందు పెను వివాదానికి దారితీసింది. అవిశ్వాసుల నిర్మూలన కోసం ప్రార్థిస్తానని సురేష్ గోపీ కూడా చెప్పారు.

దొంగ అని అనుమానించి, యువకుడిని కొట్టి చంపారు

- తల్లీ బిడ్డల అరెస్టు

ఢిల్లీ : దొంగ అని భావించి ఓ యువకుడిని కొట్టి చంపిన కేసులో ఓ తల్లి, ఆమె పిల్లలు అరెస్ట్ అయ్యారు. ఈ ఘటన ఢిల్లీలోని రోహిణిలో చోటుచేసుకుంది. సందీప్ (30) అనే యువకుడిని అతని తల్లి, ఇద్దరు కొడుకులు దొంగతనం చేశారంటూ కొట్టి చంపారు. హత్య అనంతరం మతదేహాన్ని పొలంలో వదిలేశారు. ఈ కేసులో సునీత అనే మహిళ, ఆమె ముగ్గురు కుమారులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్ జిల్లాకు చెందిన సందీప్ అనే కూలీ శుక్రవారం అర్ధరాత్రి ఒక ఇంటి దగ్గర తిరుగుతుండగా దొంగతనం చేసేందుకు వచ్చాడనే అనుమానంతో కుటుంబీకులు అతడిని దారుణంగా కొట్టారు.

న్యాయమూర్తిపై విమర్శలు కోర్టు ధిక్కారం కాదు

- మద్రాసు హైకోర్టు

చెన్నై: జడ్జిపై విమర్శలు, పరువు నష్టం కోర్టు ధిక్కారంగా పరిగణించబడదని మద్రాసు హైకోర్టు పేర్కొంది. జస్టిస్ ఆనంద్ వెంకటేష్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన డీఎంకే నేత ఆర్ఎస్ భారతిపై దాఖలైన పిటిషన్‌ను తిరస్కరిస్తూ హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. యూట్యూబర్ సవుకు శంకర్ దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరించారు. జస్టిస్‌లు ఎస్ఎం సుబ్రహ్మణ్యం, వి.శివజ్ఞానంతో కూడిన ధర్మాసనం విచారించింది. ఇలాంటి విమర్శలు కోర్టు పనితీరును మెరుగుపరుస్తాయని కూడా ధర్మాసనం అభిప్రాయపడింది.

మహారాష్ట్ర ఎన్నికలకు 99 మందితో బిజెపి తొలి జాబితా



ముంబయి : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం 99 మంది అభ్యర్థులతో బిజెపి ఆదివారం తొలి జాబితాను విడుదల చేసింది. నాగ్‌పూర్ సౌత్‌వెస్ట్ స్థానం నుండి మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పోటీ చేస్తున్నారు. ముంబయి బిజెపి అధ్యక్షుడు ఆషిష్ సెలార్ వాంద్రే వెస్ట్ సీట్ నుండి బరిలోకి దిగుతుండగా, సీనియర్ పార్టీ నేత, లోక్‌సభ ఎంపి నారాయణ్ రాణే కుమారుడు నితీష్ రాణె కంకవ్లి నుండి పోటీ చేయనున్నట్లు ప్రకటించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ బావన్‌కులే కామఠీ నుండి, కోత్రుడ్ నుండి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు చంద్రకాంత్ పాటిల్, బోకర్ స్థానం నుండి మాజీ సిఎం అశోక్ చవాన్ కుమార్తె శ్రీజయ చవాన్ పోటీ చేయనున్నారు. మహారాష్ట్రలో మొత్తం 288 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. బిజెపి 150 స్థానాల్లో పోటీ చేయనుండగా, మిగిలిన స్థానాల్లో ముఖ్యమంత్రి షిండే సారథ్యంలోని శివసేన, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి పోటీచేయనున్నాయి.

మణిపూర్‌లో కొనసాగుతున్న హింస

ఇంఫాల్ : మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతూనేవుంది. జిరిబామ్ జిల్లాలోని గ్రామ పెద్దకు చెందిన రెండు ఫామ్‌హౌస్‌లకు సాయుధ మిలిటెంట్లు నిప్పుపెట్టినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. నంగ్‌ఖాల్ ప్రాంతంలో శనివారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. హిల్‌గాట్ గ్రామ పంచాయత్ ప్రధాన్ సోమోరెంద్రోకు చెందిన రెండు ఫామ్ హౌస్‌లకు నిప్పు పెట్టారు. ఆ సమయంలో రెండు నివాసాలు ఖాళీగా ఉన్నాయని అన్నారు. భద్రతా సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టింది.

మా బిడ్డ దేశం కోసమే పనిచేస్తున్నాడు

- వికాస్ తల్లి సుదేశ్ యాదవ్
- అమెరికా నిజాలు మాట్లాడటం లేదని వ్యాఖ్య



న్యూఢిల్లీ : కేంద్ర రీసెర్చ్ అండ్ ఎనాలసిస్ సంస్థ (రా) మాజీ అధికారి వికాస్‌పై అమెరికా నిజాలు మాట్లాడటం లేదని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. అమెరికాలోని ఉగ్రవాది గురుపత్వంత్ పన్నూ హత్యకు కుట్ర పన్నినట్లు వికాస్ ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. అయితే ఈ అభియోగాలపై వికాస్ కుటుంబం విస్మయం వ్యక్తం చేసింది. 'అమెరికా చెప్పేది నిజమో..అబద్ధమో మాకు తెలియదు. కానీ మేము ఒకటే చెప్పదల్చాం. మా బిడ్డ దేశం కోసం పనిచేస్తున్నాడు' అని వికాస్ తల్లి సుదేశ్ యాదవ్ అన్నారు. ఢిల్లీకి 100 కిలోమీటర్ల దూరంలోని ప్రాణపురలో ఉంటున్న వికాస్ బంధువు ఒకరు ఆంగ్ల పత్రికతో మాట్లాడుతూ "హత్యకు అవసరమైనంత సొమ్ము అతడికి ఎక్కడిది..? వాళ్ల ఇంటి ముందు ఆడీ, మెర్సిడెస్ కార్లు ఏమైనా బారులు తీరున్నాయా..?" అని ప్రశ్నించారు. మీడియాలో తనపై తప్పుడు కథనాలు వస్తున్నాయని వికాస్ వాపోయడాని వెల్లడించారు. తమకు తెలిసినంతవరకు వికాస్ ఇప్పటికీ సిఆర్‌పిఎఫ్ కోసమే పనిచేస్తున్నాడని చెప్పారు. 2007లో యాదవ్ తండ్రి కన్నుమూశారు. ఇప్పుడు ఆయనకు తల్లి సుదేశ్ యాదవ్, సోదరుడు ఉన్నారు. ఆయన సోదరడు హరియాణా పోలీస్ విభాగంలో పనిచేస్తున్నారు. గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు గతేడాది వికాస్ యాదవ్ విఫలయత్నం చేసినట్లు అమెరికాలోని జస్టిస్ డిపార్ట్‌మెంట్ కేసు నమోదు చేసింది. ఆయన పేరును ఎఫ్‌బిఐ వాంటెడ్ లిస్టులోనూ చేర్చింది. కుటుంబ సభ్యుల వాదనను కూడా పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం మాత్రం అమెరికా ఆరోపణలు చేసిందే తడవుగా వికాస్ యాదవ్‌ను ఉద్యోగం నుంచి తొలగించినట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని అమెరికాకు కూడా తెలియజేసింది. మరోవైపు వికాస్ యాదవ్ ఇంకా భారత్‌లోనే ఉన్నాడని అమెరికా అంచనావేస్తోంది.

ఆరోగ్య సంరక్షణ కేంద్రంగా వారణాసి

- శంకర ఆసుపత్రిని ప్రారంభిస్తూ మోడీ




లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని ప్రముఖ అధ్యాత్మిక క్షేత్రం వారణాసి ఇక నుంచి ఆరోగ్య సంరక్షణకు కేంద్రంగా వ ా ం ´ న ం ొ ద ´ ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. వారణాసిలోని కంచి మంఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్‌జె శంకర ఆసుపత్రిని ఆయన ఆదివారం ప్రారంభించారు. దీంతో పాటు ఉత్తరప్రదేశ్‌లో రూ.6700 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఆయన పచ్చజెండా ఊపారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ దేశంలో ఆరోగ్య వ్యూహాలు ఐదు స్తంభాలపై ఆధారపడి ఉన్నాయన్నారు. ప్రివెంటివ్ హెల్త్ కేర్, సకాలంలో వ్యాధి నిర్ధారణ, ఉచిత, చౌకమైన చికిత్స, చిన్నచిన్న పట్టణాల్లో మెరుగైన వైద్యం, వైద్యుల కొరతను భర్తీ చేయడం, వైద్యరంగంలో సాంకేతిక విస్తరణ వంటి ఐదు స్తంభాలను ఆయన పేర్కొన్నారు. శంకర ఆసుపత్రి వల్ల యుపి, మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లోని 20 జిల్లాల ప్రజలకు లబ్ది చేకూరుతుందని మోడీ తెలిపారు.

102వ వసంతంలోకి అడుగిడిన వియస్ అచ్యుతానందన్

- ముఖ్యమంత్రి పినరయి విజయన్ సహా పలువురి శుభాకాంక్షలు

తిరువనంతపురం: సిపిఎం సీనియర్ నేత, మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్ ఆదివారం 101వ పుట్టిన రోజు జరుపుకుని, 102వ వసంతలోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తో సహా పలువురు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నా ప్రియ మిత్రుడు విఎస్‌కి పుట్టిన రోజు శుభాకాంక్షలు అని పినరయి విజయన్ తన సందేశంలో పేర్కొన్నారు. పార్టీ నాయకులు, మంత్రులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఆయనకు ఫేస్‌బుక్‌లో శుభాకాంక్షలు తెలిపారు. వృద్ధాప్యం లో వచ్చే ఆరోగ్య సమస్యల కారణంగా తిరువనంతపురంలోని బార్టన్ హిల్‌లో తన కుమారుడు వి ఎ అరుణ్ కుమార్ ఇంట్లో విఎస్ విశ్రాంతి తీసుకుంటున్నారు. అచ్యుతానందన్ 1923 అక్టోబరు 20న అలప్పుజాలోని పున్నప్రవేంటల తరవీట్‌లో శంకరన్, అక్కమ్మ దంపతులకు అచ్యుతానందన్ జన్మించారు. 1939లో స్టేట్ కాంగ్రెస్‌లో చేరిన విఎస్ 1940లో అంటే పదిహేడేళ్ల వయసులో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. పున్నప్రవాయలార్ పోరాటంలో పాల్గొన్న యోధుల్లో ఆయన ఒకరు.

ఆయుధ నౌకను అడ్డుకున్న ఏథెన్స్ డాక్ కార్మికులు



గ్రీస్: గాజా, లెబనాన్‌లపై క్రూరమైన దాడులు చేస్తూ పెద్దయెత్తున మారణ హోమం సృష్టిస్తున్న ఇజ్రాయిల్‌కు ఆయుధాలు చేరవేస్తున్న నౌకలను గ్రీస్ కార్మికులు అడ్డుకున్నారు. పాలస్తీనాకు సంఘీభావంగా పోర్టు వర్కర్స్, శాంతి ఉద్యమ కార్యకర్తలు ఇచ్చిన పిలుపు మేరకు గత గురువారం రాత్రి హైఫా నుంచి ఆయుధాల లోడ్‌తో బయల్దేరిన ఇజ్రాయిలీ కంపెనీకి చెందిన కంటెయినర్ మార్లా బుల్‌ను ఓడ రేవులోనే యూనియన్ కార్మికులు అడ్డుకున్నారు. ఎనెడెప్ యూనియన్ తీసుకున్న ఈ చర్యకు లేబర్ సెంటర్ ఫర్ పిరేయస్, మెటల్ వర్కర్స్ యూనియన్, షిప్పింగ్ ఇండస్ట్రీ పూర్తి మద్దతు ప్రకటించాయి. గాజాలో పాలస్తీనీయులను చంపేందుకు ఉపయోగించే ఆయుధాలను ఎట్టి పరిస్థితుల్లోను అనుమతించేది లేదని వారు స్పష్టం చేశారు. కార్మికుల ప్రతిఘటనతో మార్లా బుల్ నౌక ఎలాంటి ఆయుధాలు లేకుండానే అక్కడి నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. ఈ ఏడాది జూన్‌లో కూడా పిరేయస్ పోర్టు కార్మికులు ఇజ్రాయిల్‌కు సరఫరా చేసేందుకు ఉద్దేశించిన ఆయుధాలను నౌకలో లోడ్ చేయడానికి తిరస్కరించారు. ఈ ఆందోళనలో కార్మికులకు అందగా ఏథెన్స్‌లోని స్థానికంగా ఉన్న పాలస్తీనా సంఘీభావ గ్రూపులు కూడా పాల్గొన్నాయి.

మా దేశంలో ఎసామ్రాజ్యవాదుల పన్నాగాలను పారనివ్వబోమని, గాజాపై యుద్ధానికి మా భూ భాగాన్ని ఉపయోగించుకోవడాన్ని అనుమతించబోమని వారు నిర్ద్వంద్వంగా తేల్చి చెప్పారు.

ఈ పోర్టు వేలాది మంది కార్మికుల స్థితిగతులు మెరుగుపరిచేందుకు, మాకు, మా పిల్లల మెరుగైన భవిష్యత్తుకు ఉపయోగపడాలే తప్ప ప్రజలను ఊచకోత కోసే వారికి కాదని ఎనెడిప్ యూనియన్ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. గ్రీస్ కార్మిక సంఘాల చొరవను పారలస్తీనియన్ వర్కర్స్ జనరల్ యూనియన్ ప్రతినిధి బృందం ప్రతినిధి మహ్మద్ ఇక్నాయిబి అభినందించారు. గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ కూడా దీనిని అభి వందిస్తూ గ్రీస్ కార్మికులు చరిత్రకు మంచి వైపు నిలిచారుని పేర్కొంది.

ఢిల్లీలో భారీ పేలుడు

- సిఆర్‌పిఎఫ్ పాఠశాల వెలుపల ఘటన
- రంగంలోకి ఎన్ఎస్‌జి, ఎన్ఐఎ

న్యూఢిల్లీ : దేశ రాజధాని నగరం న్యూఢిల్లీలో ఆదివారం ఉదయం భారీ పేలుడు సంభవించింది. కేంద్ర రిజర్వు పోలీసు బలగాలు (సిఆర్‌పిఎఫ్) రోహిణీ ప్రాంతంలో నిర్వహిస్తున్న పాఠశాల వెలుపల ఈ ఘటన చోటుచేసుకోవడంతో ఢిల్లీ ప్రజలు భయభ్రాంతులకు లోనయ్యారు. దేశ రాజధాని ప్రాంతం పరిధిలో శాంతిభద్రతలను నేరుగా కేంద్ర హోంశాఖయే పర్యవేక్షిస్తుంటుంది. ఏకంగా సిఆర్‌పిఎఫ్ పాఠశాల వద్దే దాడి చోటుచేసుకోవడంతో ఢిల్లీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..ఈ ఘటనలో ప్రాణనష్టమేదీ సంభవించలేదు. పాఠశాల గోడ ధ్వంసమైంది. సమీపంలో పార్క్ చేసిన కార్లు, చుట్టపక్కల ఇళ్ల అద్దాలు పగిలిపోయాయి. దుకాణాల సైన్ బోర్డులు దెబ్బతిన్నాయి. స్థానికులు పేలుడు దశ్యాలను ఫోన్లలో రికార్డు చేశారు. పేలుడు ధాటికి ఆ ప్రాంతంలో దట్టమైన పొగ వ్యాపించిందని వారు తెలిపారు. పేలుడుపై సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఆ తర్వాత ఫోరెన్సిక్ బందాలు, క్రైమ్, బాంబు డిస్పోజల్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఫోరెన్సిక్ నిపుణులు పాఠశాల గోడ వద్ద తెల్లని పౌడర్ గుర్తించారు. దాన్ని పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించారు. దానితో పాటు పాఠశాల సమీపంలోని మట్టి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు అధికారులు చెప్పారు. ఎవరైనా దాడికి పాల్పడ్డారా లేదా భూగర్భ మురుగునీటి లైన్‌లోని వాయువు- పేలుడుకు కారణమైందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఘటనా స్థలంలోని సిసిటివి ఫుటేజీని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. పేడులు నేపథ్యంలో న్యూఢిల్లీ అంతటా పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. పండుగ సీజన్ కావడం వల్ల వివిధ మార్కెట్లల్లో పెట్రోలింగ్ చేయనున్నట్లు చెప్పారు. ఈ పేలుడు ఘటనపై దర్యాప్తు చేపట్టేందుకు జాతీయ దర్యాప్తు బందాలు రంగంలోకి దిగాయి. నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జి), నేషనల్ ఇన్విస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఎ) ఘటనా స్థలానికి చేరుకుని తనిఖీలు చేపట్టాయి. మరిన్ని ఆధారాల కోసం స్నిఫర్ డాగ్స్‌తో గాలింపు చర్యలు చేపట్టారు. ఘటనా స్థలాన్ని పూర్తిగా పరిశీలించడానికి ఎన్ఎస్‌జి రోబోలను మోహరించింది. ఇప్పటికే పాఠశాలను తనిఖీ చేసిన ఫోరెన్సిక్ నిపుణులు, ఘటనాస్థలిలో లభించిన వైట్ పౌడర్‌ను ప్రయోగశాలకు పంపించినట్లు అధికారులు తెలిపారు. పేలుడు సంభవించినప్పుడు పాఠశాల సమీపంలో ఎవరెవరు ఉన్నారో తెలుసుకోవడానికి మొబైల్ నెట్‌వర్క్ డేటాను సేకరిస్తున్నట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై పేలుడు పదార్థాల చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పేర్కొన్నారు.


ఘటన స్థలంలో ప్రత్యేక జాగిలాలతో తనిఖీలు నిర్వహిస్తున్న ఎన్ఎస్‌జి బృందం

ఢిల్లీ అండర్ వరల్డ్ ముంబయిగా మారుతోంది : సిఎం అతిషి సింగ్

సిఆర్‌పిఎఫ్ స్కూల్ సమీపంలో జరిగిన పేలుడు ఘటనపై ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి సింగ్ కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ఈ పేలుళ్లతో రాజధానిలో శాంతిభద్రతలు దెబ్బతిన్నాయని, ఢిల్లీ పోలీసులు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అధీనంలో పనిచేస్తున్నందున దీనికి కేంద్రమే కారణమన్నారు..ఢిల్లీలో శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యత బీజేపీ నేతత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై ఉంది. అయితే, బిజెపి దీనిని పట్టించుకోకుండా ఢిల్లీలో ఎన్నికైన ప్రభుత్వాల పనితీరును అడ్డుకునే ప్రయత్నం చేస్తోంది.

అందువల్ల, ఢిల్లీ ప్రస్తుత పరిస్థితి ముంబైలోని అండర్ వరల్డ్ రోజుల మాదిరిగానే ఉంది. కాల్పులు, ముఠాలు డబ్బులు దండుకుంటూనే ఉన్నాయి. దాన్ని అడ్డుకునే ఉద్దేశం గానీ, సామర్థ్యం గానీ బిజెపి ప్రభుత్వానికి లేదని అతిషి ఎక్స్‌లో పేర్కొన్నారు.

బ్లాకవుట్ నుంచి క్రమంగా తేరుకుంటున్న క్యూబా

హవానా : దేశాన్ని అంధకారంలోకి నెట్టిన బ్లాకవుట్ నుంచి క్యూబా క్రమంగా తేరుకుంటోంది. ఈ పరిస్థితికి కారణమైన అమెరికా ఆర్థిక దిగ్బంధనాన్ని వెంటనే ఎత్తి వేయాలని హక్కుల కార్యకర్తలు డిమాండ్ చేశారు. క్యూబా పశ్చిమ ప్రాంతంలో విద్యుత్ సేవల పునరుద్ధరణ మొదలైందని క్యూబా ఇంధన, గనుల మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారి లాజారో గుయెర్రా తెలిపారు. శాంటా క్రజ్ డెల్ నోర్టే థర్మోఎలెక్ట్రిక్ ప్లాంట్‌లో విద్యుదుత్పత్తిని చాలా వరకు పునరుద్ధరించాం, మేరీల్ ప్లాంట్ త్వరలో ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. హవానా మాయాబెక్యూలో కూడా, విద్యుత్ సేవలు క్రమంగా పునరుద్ధరించబడుతున్నాయి. .సాంకేతిక సమస్యల కారణంగా ఫెల్టన్ రెంటె థర్మోఎలెక్ట్రిక్ ప్లాంట్‌లలో విద్యుదుత్పత్తి తిరిగి ప్రారంభించడానికి కొంత సమయం పట్టవచ్చని లాజారో గెర్రా తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ యత్నాలను పర్యవేక్షించేందుకు అధ్యక్షుడు మిగ్యుల్ డియాజ్ కానెల్ వ్యక్తిగతంగా నేషనల్ లోడ్ డిస్పాచ్‌ను సందర్శించారు. విద్యుత్ సేవల పునరుద్ధరణను వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందని ఆయన తెలిపారు.





మీకోసం

పిల్లలకు కాల్షియం సంవృద్ధిగా అందాలంటే ప్రతిరోజూ ఉదయం అర చెంచా, సాయంత్రం అర చెంచా నువ్వులను నమిలి తినేలా అలవాటు చేయాలి. నువ్వుండలు తిన్నా మంచిదే.

జీవన సౌరభం

మూఢ విశ్వాసాలను, హేతువాదానికి నిలబడని వాదనలను నమ్మకూడదు. సమాజం చైతన్యవంతం కావాలంటే కాలానుగుణంగా సాగిపోవాలి.

రాణి చిలుక



ఒక అడవి మధ్యలోని పూలవనంలో రాణి అనే చిలుక ఉంది. దాని రెక్కలు అన్ని చిలుకల్లా ఆకుపచ్చగా కాకుండా పాలిపోయి తెలుపు పచ్చల కలయికతో ఉంటాయి. దీంతో మిగతా చిలుకలతో పోల్చుకుని అందంగా లేనని రోజూ బాధ పడేది రాణి. కోకిలలు, పావురాలు, కాకులు, నెమళ్లను చూసినప్పుడు 'వాటికి ఒకే రంగు దట్టంగా ఉంది. నా రంగు పాలిపోయింది. అందంగా లేను' అనుకునేది.


రాణిని చూసి కొన్ని పక్షులు నవ్వేవి. మరికొన్ని 'నువ్వసలు చిలుకవేనా? ఆకుపచ్చరంగులో మునుగు' అని ఎగతాళి చేసేవి. ఆ మాటలకు అవమానంగా ఉండేది రాణికి. కొమ్మలను విడిచి రావడానికి సిగ్గు పడేది.

ఒక రోజు అడవిలో పెద్ద వర్షం కురిసింది. పక్షులన్నీ తడిసి ముద్దయ్యాయి. వాటి రెక్కలు బరువై కదలలేక పోయాయి. అప్పుడే బలమైన గాలి వీచింది. దాంతో గుంపులుగా ఉన్న పక్షులన్నీ కిందపడ్డాయి. వాటి రెక్కలు కదపలేక, పైకి ఎగరలేక బాధపడ్డాయి. అప్పుడు ఏదో విచిత్రం జరిగినట్టు పెద్ద గాలిని తట్టుకుని రాణి ఎగర గలిగింది. అక్కణ్నించి సురక్షితమైన చోటుకి వెళ్ళింది. అది ఎగరడాన్ని మిగతా పక్షులు చూసాయి. తామంతా ఎగరలేకపోయిన వర్షంలో రాణి ఎగిరిందని, దాని రెక్కలు బలంగా ఉన్నాయని అనుకున్నాయి. వాన తగ్గాక రాణిని కలిసి ఆ విషయమే చెప్పి అభినందించాయి. ఇన్నాళ్ళూ హేళన చేసిన పక్షులే మెచ్చుకునేసరికి రాణి ఎంతో సంతోషపడింది. ఆ రోజు నుండి ప్రతివారిలో ఏదో ఒక ప్రత్యేకత ఉంటుందని, దాన్ని గుర్తించగలిగితే రూపంతో పని లేదని గ్రహించింది. క్రమంగా. తనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుంది. మిగతా పక్షుల మధ్యకు వెళ్లడానికి ఇప్పుడు రాణి అస్సలు సంకోచించడంలేదు. స్వేచ్ఛగా రెక్కలు చాచుకుని మరీ ఎగురుతోంది.

- నారంశెట్టి ఉమామహేశ్వరరావు, 94907 99203.

దారి కనిపెట్టండి

పిల్లలూ, తల్లి డైనోసార్, పిల్ల డైనోసార్‌ని చేరే దారి చూపెట్టరూ.



నేను గీసిన బొమ్మ





మన్నె శృతిక,
6వ తరగతి,
నారాయణ స్కూల్,
చీమకుర్తి, ప్రకాశం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

దేశసేవలో మేము సైతం....

నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) అనేది జాతీయ యువజన విభాగం. ఇది ఒక స్వచ్ఛంద ప్రాతిపదికన ఏర్పాటు చేసిన సంస్థ. ఇది భారత సాయుధ దళాల అంతర్భాగం. దేశంలోని యువతను క్రమశిక్షణ, దేశభక్తి కలిగిన పౌరులుగా తీర్చిదిద్దటంలో ప్రముఖ పాత్రను పోషిస్తోంది. ఇది పాఠశాలలో మొదలై డిగ్రీ స్థాయిలో క్యాడెట్స్‌గా ఎంపిక చేసుకుని శిక్షణ అందిస్తారు. వీరికి డ్రిల్, ఆయుధాల వినియోగం తదితర వాటిపై శిక్షణ ఇచ్చి ఏ, బీ, సీ సర్టిఫికెట్లను అందజేస్తారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌వింగ్‌లో ఎన్‌సీసీ పూర్తి చేసిన వారికి రిజర్వేషన్ కల్పిస్తారు. ఆయా జిల్లాల పరిధిలోని వివిధ బెటాలియన్లు, పాఠశాల, కళాశాలలకు చెందిన ఎన్‌సిసి క్యాడెట్లకు శిక్షణా శిబిరాలు కొనసాగుతుంటాయి. శ్రీవిశ్వశాంతి విద్యాసంస్థల నుంచి కొంతమంది కేడెట్లు ఈనెల 16 నుంచి 25 వరకూ తెలంగాణాలోని మొహిదీపట్నంలో జరిగే ఆర్‌డిసి శిక్షణా శిబిరానికి వెళ్లారు.



కృష్ణా జిల్లా ఉయ్యూరు పట్టణంలోని శ్రీ విశ్వశాంతి విద్యాసంస్థల ఎన్‌సిసి యూనిట్ల ద్వారా అత్యుత్తమ కేడెట్లను తయారుచేస్తున్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమైక్యత సాధనకు గాను ఈ విద్యాసంస్థల్లో 2004-2005లో ఎన్‌సిసి యూనిట్లను చైర్మన్ మాదాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, డైరెక్టర్ సూర్యశేఖర్, ప్రిన్సిపల్ పద్మజ ప్రారంభించారు. 16వ ఆంధ్రా బెటాలియన్‌లో జూనియర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు, 17వ ఆంధ్రా బెటాలియన్, 8వ ఆంధ్రా నావల్ బాలురు విభాగం పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, 8వ ఆంధ్రా ఎయిర్ స్క్వాడ్రన్ బాలురు, 4వ ఆంధ్రా గరల్స్ విభాగం యూనిట్లు పనిచేస్తున్నాయి. ఏలూరులోని సిఆర్‌రెడ్డి పబ్లిక్ స్కూలులో ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ ఐదోతేదీ వరకూ జరిగిన ఆర్‌డిసి సెలక్షన్స్‌లో శ్రీ విశ్వశాంతి క్యాడెట్లు అత్యున్నత ప్రతిభ కనబర్చారు. ఇక్కడ నిపుణత సాధించిన వారిని మొహిదీపట్నం శిబిరానికి ఎంపిక చేశారు. ఎంపికైన క్యాడెట్లలో బాలురు, బాలికలు ఉన్నారు. ఆయుధ శిక్షణ, మ్యాప్ రీడింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్ లేదా బాటిల్ క్రాఫ్ట్, ఫైరింగ్‌తోపాటుగా క్రమశిక్షణ, యోగా, నాయకత్వ లక్షణాలు, మార్చింగ్ డ్రిల్, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ విషయాలపై నిపుణులతో ఉపన్యాసాలు, క్రీడాపోటీలు, వ్యర్థాలను రీ సైక్లింగ్ చేసే పద్ధతులు, కెరీర్ కౌన్సిలింగ్‌తోపాటు సేవా కార్యక్రమాల్లో భాగంగా స్వచ్ఛభారత్, రక్తదానం, వివిధ అంశాలపై అవగాహనా ర్యాలీలు తదితర వాటిల్లో క్యాడెట్లకు తర్ఫీదును ఇస్తున్నారు.

ఫైరింగ్‌లోనూ హుషారుగా ...

ఫైరింగ్ చేయటం అంటే ఓ విధమైన ఒత్తిడి. ఉత్కంఠ ఉంటుంది. అందులో అమ్మాయిలు ఇలాంటివి చేయటమంటే సాహసమే. రెండు మూడు శిబిరాల్లో పాల్గొన్న వారు సులభంగా చేస్తున్నా కొత్తవారు మాత్రం బెరుగ్గా ఉంటున్నారు. క్రమేపి గాడిలో పడుతున్నారు. ఫైరింగ్ వారిలో ఎంతో ఉత్సాహాన్ని నింపుతోంది. అందరూ పోటీపడి ఇందులో సాధన చేస్తున్నారు. గుడారాలు వేయటం కూడా ఓ కళ. ఇది చాలా చిన్న పనిగా కన్పించినా ఏర్పాటు చేయాలంటే నైపుణ్యం ఉండాలి. ఇక మ్యాప్ రీడింగ్ వంటివి కొంచెం కష్టంగా ఉన్నాయని విద్యార్థినులు చెబుతున్నారు. అయితే ఓ బృందంగా ఉండి వీటిలో శిక్షణ పొందుతుండటంతో పెద్ద అసౌకర్యంగా లేదని ఇదో కొత్త అనుభూతినిస్తోందని వారంటున్నారు.

- యడవల్లి శ్రీనివాసరావు

పరేడ్‌కు వెళ్తే పతకం ఖాయమే..



సంస్థాపరంగా ఇచ్చే శిక్షణ ప్రాక్టికల్ పద్ధతిలో సాగుతుంది. విద్యార్థులను నిపుణులుగా ఈ అంశంలో తీర్చిదిద్దటానికి యాజమాన్యం ఎంతో ప్రాధాన్యత ఇచ్చి శిక్షణను ప్రోత్సహిస్తోంది. రిపబ్లిక్ డే, ఇండిపెండెంట్స్ డే, యూత్ ఎక్స్చేంజ్ ప్రోగ్రామ్స్‌లో విద్యార్థులు ఎంతో చురుగ్గా పాల్గొంటారు. స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్ (ఎస్ఎన్ఐ), నేషనల్ ఇండిగ్రేషన్ క్యాంప్ (ఎస్ఐసి), అడ్వాన్స్‌డ్ లీడర్ క్యాంప్, ట్రెక్కింగ్, ఆర్మీ అటాచ్‌మెంట్ కార్యక్రమాల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకూ సాగించిన ప్రయాణంలో ఎన్నో పతకాలు, అవార్డులకు క్యాడెట్లు ఎంపికయ్యారు.

- కెప్టెన్ వేమూరి ఎలిజబెత్ రాణి, 16వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సిసి

పోలీసు ఉద్యోగమే లక్ష్యం



పోలీసు ఉద్యోగం సంపాదించాలనేది నా లక్ష్యం. అందులో ఎన్‌సిసిలో చేరి శిక్షణ పొందుతున్నా. ఇక్కడ నేర్చుకుంటున్న ఫైరింగ్ ఇతర అంశాలు నాకు భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడతాయి. జాతీయస్థాయి శిబిరానికి ఎంపికవ్వాలనేది నా లక్ష్యం. ఫైరింగ్, గుడారాలు వేయటం, మ్యాప్ రీడింగ్‌లో ఎక్కువ దృష్టి పెట్టాను.

- నైషా

ఇటు అవగాహన..అటు శిక్షణ



ఈ ఎన్‌సిసి శిబిరాల్లో సామాజిక బాధ్యతను వివరిస్తున్నారు. ఇదే మంచి అనుభూతి. ప్రమాదాల్లో చిక్కుకుంటే ఎలా బయటపడాలి. పక్కవారిని ఎలా గట్టెక్కించాలన్నది కూడా శిక్షణలో చెబుతారు. ప్రాక్టీకల్‌గా మాతో చేయిస్తున్నారు. నేర్చుకునే అంశాలు కఠినంగా ఉన్నా శిక్షకులు నేర్పుగా చేసి చూపిస్తున్నారు. దీంతో మాకు పెద్దగా కష్టంగా లేదు.

- ప్రియాంకదేవి

దేశానికి సేవలందిస్తా



మూడేళ్ల నుంచి ఎన్‌సిసి శిక్షణ పొందుతున్నా. శిక్షణ ఎంతో బాగుంది. అనేక అంశాల్లో శిక్షణ ఇస్తుండటంతో పాటు పోటీలు నిర్వహిస్తున్నారు. నేను సైన్యంలో చేయాలని ఉంది. మిలట్రీ ద్వారా దేశానికి సేవ చేస్తా. క్రమశిక్షణతో పాటు సాంకేతిక అంశాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. దేశ సేవ, క్రమశిక్షణ, పరస్పర సహకారం వంటి లక్షణాలు అలవడ్డాయి.

- లావణ్య

క్రమశిక్షణ అలవడింది



ఎన్‌సిసిలో చేరటం వల్ల క్రమశిక్షణ అలవడింది. ప్రతి పని సకాలంలో చేస్తున్నా. ఇక్కడ శిక్షణలో నేర్పించే అంశాలు మాకు భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడతాయి. శిక్షణతో పాటు పోటీలు కూడా నిర్వహిస్తున్నారు. అందువల్ల రోజూ కష్టపడుతున్నాం. అయినా మాకు ఎలాంటి ఇబ్బంది లేదు. పోటీతత్వంతో పనిచేస్తున్నాం. బాగా చదువుకుని ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనేది నా లక్ష్యం. ఇందులో ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుంది.

- బ్రాహ్మణి శ్రీరెడ్డి



ఆట సందీప్, శగ్న శ్రీ

డ్రగ్స్ నేపథ్యంలో ది షార్ట్ కట్

డి ఎల్ ఎంటర్టైన్మెంట్ పతాకంపై ఆట సందీప్ హీరోగా, శగ్న శ్రీ హీరోయిన్‌గా రామకృష్ణ కంచి దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'ది షార్ట్ కట్'. ఈ చిత్ర ట్రైలర్ రిలీజ్ వేడుక ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా జరిగింది. కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,'ఆట సందీప్ హీరోగా ఎదగడం ఎంతో సంతోషంగా ఉంది. అయితే హీరోగా ఎంత ఎత్తుకు ఎదిగినా కొరియోగ్రఫీని మాత్రం విస్మరించవద్దు. ఈ సినిమాలో ఉన్న డైలాగులు కొన్ని సినిమా వాళ్ళ జీవితాలకు అతి దగ్గరగా ఉన్నాయి. దర్శకుడు రామకృష్ణ సినిమాను చాలా బాగా తీశారు. ఈ సినిమా తప్పకుండా హిట్ అవుతుంది' అని తెలిపారు.

'హైదరాబాద్ లాంటి మెట్రో పాలిటన్ సిటీలో రోజు రోజుకు పెరుగుతున్న డ్రగ్ కల్చర్ పై సినిమా తీశాం. డ్రగ్స్ వల్ల సమాజానికి ఎంత ప్రమాదం అనే అంశాన్ని చెబుతూనే, డ్రగ్స్ నివారణ కోసం ఏం చేయాలనే విషయాన్ని కూడా సినిమాలో చెబుతున్నాం. హీరో అట సందీప్‌కు కథ చెప్పగానే అంగీకరించి నందుకు కృతజ్ఞతలు' అని దర్శకుడు రామకృష్ణ కంచి అన్నారు.

హీరో అట సందీప్ మాట్లాడుతూ,'కథ బాగా నచ్చింది. కామెడీతో పాటు యాక్షన్ నేపథ్యంలో సాగే సినిమా ఇది. ఈ సినిమాలో రీ -రికార్డింగ్‌కి ఎంతో ప్రాధాన్యత ఉంది. సినిమా ఇండస్ట్రీలో డైరెక్టర్ అవుదామని ప్రయత్నిస్తున్న యువకుడి జీవితం ఎలా మారింది అనేదే ఈ సినిమా' అని తెలిపారు. 'ఇందులో నేను చాలా మంచి పాత్ర పోషించాను. ఇది తప్పకుండా మంచి పేరు తీసుకొస్తుంది. ఈ సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన దర్శకుడు రామకృష్ణకు కృతజ్ఞతలు' అని హీరోయిన్ శగ్న శ్రీ చెప్పారు.

మళ్ళీ మళ్ళీ చూసేలా..

విశ్వక్ సేన్ నటిస్తున్న నూతన చిత్రం 'మెకానిక్ రాకీ'. నూతన దర్శకుడు రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. మేకర్స్ ఆదివారం 'మెకానిక్ రాకీ' ట్రైలర్ 1.0 లాంచ్ చేశారు. శ్రీరాములు థియేటర్లో భారీగా హాజరైన అభిమానుల సమక్షంలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ఘనంగా జరిగింది.

ఈ సందర్భంగా విశ్వక్ సేన్ మాట్లాడుతూ,'నవంబర్ 22 సినిమా రిలీజ్. రీసెంట్‌గా సినిమా చూశా. చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాను. నవంబర్ 21న పెయిడ్ ప్రీమియర్స్ వేస్తాం. సినిమా ఎడ్జ్ ఆఫ్ ది సీట్ ఎక్స్‌పీరియన్స్ చేస్తారు. రెండోసారి సినిమా చూసే రేంజ్‌లో ఉంది. ఇది ట్రైలర్ 1.0. రిలీజ్ దగ్గరలో మరో ట్రైలర్ రిలీజ్ అవుతుంది' అని తెలిపారు.

'ట్రైలర్ అందరికీ బాగా నచ్చిందని అనుకుంటున్నాను. ఇంకా చాలా కంటెంట్ ఉంది. ఒకొక్కటి అనౌన్స్ చేస్తూ ఉంటాం. అవన్నీ మీకు చాలా ఎగ్జైటింగ్‌గా ఉంటాయని ఆశిస్తున్నాను' అని డైరెక్టర్ రవితేజ చెప్పారు.

నిర్మాత రామ్ తాళ్లూరి మాట్లాడుతూ, 'సినిమా కూడా మాస్ కా దాస్ రేంజ్‌లో ఉటుంది. నవంబర్ 22 థియేటర్స్‌లో మాస్ జాతర ఖాయం. అందరూ థియేటర్స్‌కి వచ్చి చూసి ఎంజాయ్ చేయండి' అని అన్నారు.



విశ్వక్‌సేన్, శ్రద్ధా శ్రీనాథ్

ఈ రేంజ్ సక్సెస్ ఊహించలేదు

రామ్ కార్తీక్, కశ్వి జంటగా నటించిన చిత్రం 'వీక్షణం'. ఇటీవల విడుదలైన ఈ చిత్రానికి విశేష ప్రేక్షకాదరణ లభిస్తోంది.

ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన థ్యాంక్స్‌మీట్‌లో డైరెక్టర్ మనోజ్ పల్లేటి మాట్లాడుతూ, 'చాలా హ్యాపీగా ఉంది. సక్సెస్ అవుతుందని తెలుసు, కానీ ఈ రేంజ్ సక్సెస్ చూసి చాలా సంతోషంగా ఉంది. ప్రీమియర్ షో దగ్గర నుంచి ఈ రోజు వరకు ఇదే రెస్పాన్స్ వస్తోంది. థియేటర్‌కి వచ్చి మూవీ చూసి మా సినిమాను ఇంత పెద్ద సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికీ చాలా పెద్ద థ్యాంక్స్' అని తెలిపారు.



రామ్ కార్తీక్

'మా సినిమాను ఇంతలా జనాల్లోకి తీసుకువెళ్లిన మీడియా వాళ్లకు, సినిమాను చూసి ఆదరించిన ప్రేక్షకులకు హృదయపూర్వక ధన్యవాదాలు. చాలా మంచి పాజిటివ్ రివ్యూలు వచ్చాయి. నేను కూడా నిన్న కొన్ని థియేటర్స్‌కి వెళ్లాను. అక్కడ అంతా చాలా పాజిటివ్‌గా ఉంది' అని హీరో రామ్ కార్తీక్ చెప్పారు.

మ్యూజిక్ డైరెక్టర్ సమర్థ్ గొల్లపూడి మాట్లాడుతూ, 'రివ్యూస్ చాలా బాగా వచ్చాయి. చాల హ్యాపీగా ఉంది. సినిమాని ఇంత పెద్ద సక్సెస్ చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని తెలిపారు.

నటుడు శ్రీరామ్ మాట్లాడుతూ, 'ఇది నా ఫస్ట్ సినిమా. నా మొదటి సినిమాకే ఇంతమంది ప్రేమ దొరకడం చాలా హ్యాపీగా ఉంది. నన్ను ఈ పాత్రకు సెలెక్ట్ చేసిన డైరెక్టర్ మనోజ్‌కి ఋణపడి ఉంటా' అని అన్నారు.

'ప్రేక్షకులందరికీ మనస్ఫూర్తిగా థ్యాంక్స్. నేను ఈ పాత్ర చేయగలను అని నమ్మి, అవకాశం ఇచ్చిన దర్శకుడు మనోజ్‌కి ధన్యవాదాలు. ఆయన నమ్మకాన్ని నిలబెట్టడం ఆనందంగా ఉంది' అని చెప్పారు.

పొట్టికప్ విశ్వవిజేత న్యూజిలాండ్

- దక్షిణాఫ్రికాపై 32 పరుగులతో ఘనవిజయం
- మహిళల టి20 ప్రపంచకప్



దుబాయ్: ఐసిసి మహిళల టి20 ప్రపంచ కప్ 2024 విజేతగా న్యూజిలాండ్ అవతరించింది. ఫైనల్లో దక్షిణాఫ్రికాపై 32 పరుగుల తేడాతో గెలిచి ఛాంపియన్‌గా నిలిచింది. కివీస్ టి20 ప్రపంచకప్‌ను సాధించడం ఇదే తొలిసారి. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. ఈ లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 126 పరుగులకే పరిమితమైంది. ఓపెనర్లు లారా వోల్వార్ట్ (33) (27 బంతుల్లో 5 ఫోర్లు), తంజ్మిమ్ బ్రిట్స్ (17) తొలి వికెట్‌కు 51 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. తర్వాత దక్షిణాఫ్రికా వరుసగా వికెట్లు కోల్పోయింది. అన్నేకే బోష్ (9), మారిజేన్ కాప్ (8), నాడిన్ డి క్లర్క్ (6) వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. కివీస్ బౌలర్లలో అమేలియా కెర్ 3, రోజ్‌మేరీ 3, కార్సన్, ఫ్రాన్ జోనాస్, బ్రూక్ తలో వికెట్ పడగొట్టారు.

కివీస్ బ్యాటర్లలో అమేలియా కెర్ (43రన్స్, 38 బంతుల్లో 4 ఫోర్లు), బ్రూక్ హాలిడే (38రన్స్, 28 బంతుల్లో 3 ఫోర్లు), సుజీ బేట్స్ (32 రన్స్, 31 బంతుల్లో 3 ఫోర్లు) రాణించారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఎంలాబా 2, ఆయబొంగ ఖాకా, ట్రయాన్, నాడిన్ డి క్లర్క్ తలో వికెట్ పడగొట్టారు.

36 ఏళ్ల నిరీక్షణకు తెర!

తొలిటెస్టులో ఓడిన టీమిండియా
1988 తర్వాత భారత్‌లో కివిస్ టెస్టు తొలివిక్టరీ
1-0 ఆధిక్యంలో న్యూజిలాండ్
సొంతగడ్డపై భంగపాటు



స్వల్ప టార్గెట్‌ను కాపాడుకుని భారత్ సంచలన విజయం సాధిస్తుందేమోనని ఆశించిన అభిమానులకు నిరాశే మిగిలింది. కేవలం 107 పరుగుల టార్గెట్‌ను కివీస్ రెండు వికెట్లను మాత్రమే కోల్పోయి ఛేదించింది. దీంతో భారత్ - న్యూజిలాండ్ మధ్య జరిగిన తొలిటెస్ట్ మ్యాచ్‌లో భారత్ ఘోర పరాజయాన్ని చవిచూసింది. దీంతో బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో న్యూజిలాండ్ 36 ఏళ్ల నిరీక్షణకు తెరపడింది. వర్షం ప్రభావిత పరిస్థితుల్లో పేస్‌ను అనుకూలించిన పిచ్‌పై కివీస్ అద్భుత విజయం సాధించింది. 8 వికెట్ల తేడాతో తొలి టెస్టులో భారత్‌పై ఘన విజయం సాధించింది. 1988 తర్వాత భారత్‌లో న్యూజిలాండ్‌కు దక్కిన తొలి టెస్టు విజయం ఇదే.

కివీస్ లక్ష్యం 107 పరుగులు. పేస్ దళపతి బుమ్రా ప్రతి బంతికి వికెట్ పడగొట్టే ఒత్తిడి సృష్టించినా.. అభిమానులు ప్రతి బంతికి వికెట్ కోసం అప్పీల్ చేసినా.. అసమాన ఒత్తిడిని న్యూజిలాండ్ అధిగమించింది. రచిన్ రవీంద్ర (39 నాటౌట్), విల్ యంగ్ (48 నాటౌట్) రాణించడంతో మూడు టెస్టుల సిరీస్‌లో న్యూజిలాండ్ 1-0 ఆధిక్యం సాధించింది.

బెంగళూర్ : తొలి టెస్టులో న్యూజిలాండ్ ఘన విజయం సాధించింది. 107 పరుగుల ఊరించే లక్ష్యాన్ని 27.4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. రచిన్ రవీంద్ర (39 నాటౌట్, 46 బంతుల్లో 6 ఫోర్లు), విల్ యంగ్ (48 నాటౌట్, 76 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) ఒత్తిడిలో కీలక ఇన్నింగ్స్‌లతో న్యూజిలాండ్‌ను గెలుపు తీరాలకు చేర్చారు. ఉదయం సెషన్లో జస్‌ప్రీత్ బుమ్రా పేస్‌తో నిప్పులు చెరిగినా.. సొంతగడ్డపై భారత్‌కు అనూహ్య పరాభవం తప్పలేదు. తొలి ఇన్నింగ్స్‌లో శతకం సహా ఛేదనలో సూపర్ ఇన్నింగ్స్‌తో మెరిసిన భారత సంతతి కివీస్ ఆటగాడు రచిన్ రవీంద్ర 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. మూడు మ్యాచుల టెస్టు సిరీస్‌లో న్యూజిలాండ్ 1-0తో ముందంజ వేసింది. భారత్, న్యూజిలాండ్ రెండో టెస్టు ఈ నెల 24 నుంచి పుణె వేదికగా జరుగనుంది.

బుమ్రా మెరిసినా.. : పిచ్‌ను సరిగా అర్థం చేసుకోకపోవటం, తుది జట్టు ఎంపికలో వ్యూహాత్మక తప్పిదం భారత్‌ను మరోసారి వెంటాడింది. ఆఖరు రోజు ఆటలో ఉదయం సెషన్లో పిచ్ నుంచి సీమర్లకు గొప్ప సహకారం లభించింది. పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా కళ్లుచెదిరే బంతులు సంధించాడు. రెండో బంతికే న్యూజిలాండ్ కెప్టెన్ టామ్ లేథమ్ (0)ను అవుట్ చేసి భారత శిబిరంలో జోష్ తీసుకొచ్చాడు. మూడో పేసర్ లోటు భారత్‌కు ప్రతికూలంగా మారగా.. న్యూజిలాండ్ బ్యాటర్లకు ఒత్తిడిని అధిగమించేందుకు పనికొచ్చింది. బుమ్రా రెండు వికెట్లు పడగొట్టినా.. మరో ఎండ్‌లో సహకారం లభించలేదు. సిరాజ్ ఏడు ఓవర్లలో వికెట్ తీయలేకపోయాడు. స్పిన్నర్లు రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, రవిచంద్రన్ అశ్విన్‌లకు పిచ్ నుంచి సహకారం లభించలేదు.

స్కోరు వివరాలు :

భారత్ తొలి ఇన్నింగ్స్ : 46/10

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ : 402/10

భారత్ రెండో ఇన్నింగ్స్ : 462/10

న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్ : టామ్ లేథమ్ (ఎల్బీ) జస్‌ప్రీత్ బుమ్రా 0, డెవాన్ కాన్వే (ఎల్బీ) జస్‌ప్రీత్ బుమ్రా 17, విల్ యంగ్ నాటౌట్ 48, రచిన్ రవీంద్ర నాటౌట్ 39, ఎక్స్‌ట్రాలు : 6, మొత్తం : (27.4 ఓవర్లలో 2 వికెట్లకు) 110.

వికెట్ల పతనం : 1-0, 2-35.

బౌలింగ్ : జస్‌ప్రీత్ బుమ్రా 8-1-29-2, మహ్మద్ సిరాజ్ 7-3-16-0, రవీంద్ర జడేజా 7.4-1-28-0, కుల్దీప్ యాదవ్ 3-0-26-0, రవిచంద్రన్ అశ్విన్ 2-0-6-0.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68